TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND GUNTUR

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 197 మంగళవారం, జూన్ 02, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు
- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రస్తూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

## భారత్-ఒమన్ డీల్.. హార్మూజ్‌కు ప్రత్యామ్నాయం దొరికినట్లేనా..?



చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి .. పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో చిక్కుకోవడం భారత్‌కు ఇబ్బందికరంగా మారింది. ఈ పరిణామాల వేళ భారత్-ఒమన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ట్రేడ్ డీల్ (×అఒఖ-ాఎఖఅ ంతీఖఒవ ఐవఖశ్రీ)తో హార్మూజ్ మీద ఆధారపడకుండా చమురు దిగుమతుల కోసం భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గం దొరికినట్లేనని వాణిజ్య నిపుణులు భావిస్తున్నారు.

**ఏంటీ డీల్..** వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్, ఒమన్ మధ్య ఈ చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. గతేడాది డిసెంబరులో ప్రధాని మోదీ మస్కట్ పర్యటనకు వెళ్లినప్పుడు ఇరు దేశాల ప్రతినిధులు దీనిపై సంతకాలు చేశారు. ఈ జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. దీని కింద ఇరు దేశాలు పలు రకాల దిగుమతులకు సుంకాలను మినహాయించాయి. ఈ ఒప్పందంతో భారత్ నుంచి ఒమన్‌కు ఎగుమతయ్యే 99.38శాతం ఉత్పత్తులకు ఇకపై ఎలాంటి సుంకం ఉండదు. రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, లెదర్, ఫుట్‌వేర్, ప్లాస్టిక్స్, ఫర్నీచర్, వ్యవసాయ, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలు, మెడికల్ పరికరాలు, ఆటోమొబైల్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. టారిఫ్ మినహాయింపులతో మన దేశ ఉత్పత్తులకు ఒమన్‌లో మరింత మార్కెట్ లభించనుంది. ఇక, మస్కట్ నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తుల్లో 78శాతం వాటికి భారత్ ఈ డీల్ కింద సుంకం మినహాయించింది.

**లొకేషన్‌తో లాభం..** ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలో 20శాతం హార్మూజ్ మీదుగానే సరఫరా అవుతుండంతో వ్యూహాత్మకంగా ఇది అత్యంత కీలకమైన జలసంధి. కానీ, గత కొన్నిరోజులుగా అమెరికా-ఇరాన్ యుద్ధంతో ఈ జలమార్గంలో చమురు, ఇతర నౌకల రవాణాకు అంతరాయం కలిగింది. ఒమన్‌తో డీల్ కుదరడంతో హార్మూజ్‌ను పక్కనబెట్టి గల్ఫ్ దేశాల నుంచి చమురు దిగుమతులు పెంచుకునే అవకాశాలు లభించినట్లయ్యింది. ఒమన్ తీరప్రాంతంలో అధిక భాగం ఈ జలసంధికి వెలుపలే ఉంటుంది. ఇది గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రానికి ఆనుకుని ఉంటుంది. అందువల్ల హార్మూజ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిన సమయాల్లోనూ సలాలా, దుఖ్మ్ వంటి పోర్టుల నుంచి భారత్ ఇంధన సరఫరా చేసుకునే వీలుంటుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ పోర్టుల నుంచి భారత్ చమురు దిగుమతులను పెంచింది.

గతేడాది ఏప్రిల్‌లో గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు 15 బిలియన్ డాలర్ల మేర విలువైన ఉత్పత్తులు దిగుమతి అయ్యాయి. కానీ, ఈసారి పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఏప్రిల్ నెలలో ఆ దిగుమతులు 9.8 బిలియన్ డాలర్లకు తగ్గాయి. అదే సమయంలో ఒమన్ నుంచి మన దేశానికి దిగుమతులు ఏకంగా 246.4శాతం పెరిగి 1.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో అత్యధికం ముడిచమురు, యూరియానే కావడం గమనార్హం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.2 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఒమన్ నుంచి దిగుమతి చేసుకుంది. ఇందులో చమురు విలువ 1.6 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 1.2 బిలియన్ డాలర్ల విలువైన ఎల్‌ఎన్‌జీని దిగుమతి చేసుకుంది. ఇదే సమయంలో మస్కట్‌కు మన దేశం నుంచి ఎగుమతుల విలువ 3.64 బిలియన్ డాలర్లుగా ఉంది. వీటిలో అత్యధికం రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తులు, ఉక్కు, స్టీల్, బియ్యం వంటివి ఉన్నాయి.

## వర్షాభావంపై రైతులకు అవగాహన కల్పించాలి: సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, జూన్ 1: వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సెక్రటేరియట్‌లో సమీక్ష జరిగింది. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు.తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘాల ఎన్నికల తర్వాతే ఆర్టీసీ విలీనం

### త్వరలో నోటిఫికేషన్ జారీ: మంత్రి పొన్నం



పెద్దపల్లి, : ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల తర్వాతే సంస్థ విలీన ప్రక్రియ చేపట్టనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పెద్దపల్లిలో నిలిచిపోయిన ఆర్టీసీ డిపో నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆర్టీసీ విలీన ప్రక్రియలో ఎదురయ్యే అడ్డంకులను అధిగమించేందుకు ఈ ప్రక్రియలో కార్మికులను భాగస్వామ్యం చేయనున్నట్లు చెప్పారు. గుర్తింపు సంఘాల్లో గెలుపొందిన ప్రతినిధుల అభిప్రాయాలకు అనుగుణంగా విలీనం జరుగుతుందన్నారు. ఇప్పటికే దీని కోసం నలుగురు మంత్రులు, 15 మంది అధికారులతో సుదీర్ఘంగా చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు వివరించారు. ఆర్టీసీ కార్మికులకు 11వ పీఆర్సీ మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ విజయరమణారావు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ రీఎగ్జామ్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు..

### ఓఎంఆర్ విధానమే ఖరారు



ఢిల్లీ, జూన్ 1 : నీట్-యూజీ రీఎగ్జామ్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. జూన్ 21వ తేదీన జరగబోయే ఔఇఖ పున:పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష(అఖ) విధానంలో నిర్వహించాలనే పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో పరీక్షను యథాతథంగా ఓఎంఆర్ పద్ధతిలోనే నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు బెంచ్, పరీక్షా విధానాన్ని అకస్మాత్తుగా మార్చడం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని పేర్కొంది. సమయాభావం, అలాగే పరీక్ష నిర్వహణ సంస్థ అయిన ఎన్‌టీఏ పై ఉన్న భారీ నిర్వహణ ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. పిటిషనర్లు, ముఖ్యంగా ఆర్‌జెడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌లో నీట్ పరీక్షలో సంస్కరణలు అవసరమని వాదించారు. పరీక్షను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించడంతో పాటు, ప్రశ్నపత్రాల భద్రత కోసం ఎన్‌క్రిప్టెడ్ సిస్టమ్ ఉపయోగించాలని, అలాగే కృత్రిమ మేధస్సు (ంఎ) ఆధారిత నిఘా వ్యవస్థలు అమలు చేయాలని సూచించారు. అంతేకాకుండా, ప్రస్తుత పరీక్ష నిర్వహణ సంస్థ ఔఆం స్థానంలో కొత్త స్వతంత్ర అథారిటీని ఏర్పాటు చేయాలని కూడా పిటిషనర్ డిమాండ్ చేశారు.అయితే, సుప్రీంకోర్టు ఈ దశలో తక్షణ మార్పులు అమలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేస్తూ, రీఎగ్జామ్‌ను ఇప్పటికే ప్రకటించిన విధంగా ఓఎంఆర్ విధానంలోనే కొనసాగించాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థలో విస్తృత సంస్కరణలు అవసరమని కోర్టు అంగీకరించినప్పటికీ, వాటిని అమలు చేయడానికి సమగ్ర విధానపరమైన పరిశీలన అవసరమని పేర్కొంది. ఈ కేసులో నీట్ పరీక్షా విధాన మార్పులపై సుదీర్ఘ విచారణను వేసవి సెలవుల అనంతరం చేపట్టాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో విద్యార్థులు, పరీక్షా వ్యవస్థపై దీర్ఘకాల ప్రభావం చూపే సంస్కరణలపై విస్తృతంగా చర్చ జరగనుంది.

## ఎపి, తెలంగాణ ప్రజల మధ్య చిచ్చు పెడతామంటే ఊరుకోనేది లేదు: కవిత



హైదరాబాద్: తెలంగాణ విస్తరిస్తామని ఎపి మంత్రి లోకేష్ అంటున్నారని, ఇదేమీ సామ్రాజ్యం కాదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తెలిపారు. తెలంగాణలో నవనిర్మాణం పేరుతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సభ పెడతారట అని అన్నారు. ఎపి నేతలపై కవిత వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కుట్రలతో తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారని, 13 ఏళ్లయినా ఎపిలో కనీసం రాజధాని కట్టుకోలేదని విమర్శించారు. ఎపి, తెలంగాణ ప్రజల మధ్య చిచ్చు పెడతామంటే ఊరుకోనేది లేదని కవిత హెచ్చరించారు. వర్షాకాలంలో సచివాలయంలోకి నీరు రాకుండా పవన్, లోకేష్ చూసుకోవాలని, సిఎం ఎపి ఏజెంట్.. అందుకే ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారని మండి పడ్డారు.. అధికారంలోకి వచ్చాక ఆ విగ్రహాలు అన్నీ కూలగొడతామని సూచించారు. జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ఆంధ్రావాళ్లంతా తమవారేనని, ఆంధ్రావాళ్లను 12 ఏళ్లు కడుపున పెట్టి కాపాడుకున్నామని, ఇకపై కూడా హైదరాబాద్ లోని ఆంధ్రావాళ్లను కాపాడుకుంటామని తెలియజేశారు. ఇక్కడకు రావచ్చు..పోవచ్చు, రొయ్యలు అమ్ముకోవచ్చు, షూటింగ్ లు చేసుకుని పోవచ్చునని, ఎపి నేతలు తమ సచివాలయంలో గరిటె తిప్పుతామంటే కుదరదు అని కవిత హెచ్చరించారు.

## దేశంలో మక్కలు కొన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ: మంత్రి తుమ్మల



హైదరాబాద్: దేశంలో మొక్కజొన్నలు కొన్న ఏకైక రాష్ట్రం తెలంగాణనేనని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 14 లక్షల టన్నుల మక్కలు కొన్నట్లు చెప్పారు. మక్కల కొనుగోలుపై మంత్రి ఆదివారం మాట్లాడారు.

"కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల కొనుగోలులో కొంత ఆలస్యమైంది. లారీలు, కూలీలు, డీజిల్ కొరత ఉంది. అయినా, రాష్ట్రంలో గోదాంలు నిండటంతో పొరుగు రాష్ట్రాలకు పంపుతున్నాం. మక్కల కొనుగోలు వల్ల నష్టం వచ్చినా.. రైతులను ఆదుకుంటాం. దేశంలో అత్యధికంగా వరి కొనుగోలు చేసిన రాష్ట్రం కూడా తెలంగాణనే. ఇప్పటి వరకు 65 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం" అని మంత్రి తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదు: ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి




హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం పౌరుల హక్కులను హరించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వ్యక్తుల కుటుంబాల్లోకి తొంగిచూసి, బెదిరించి లొంగదీసుకోవాలని చూశారని మండిపడ్డారు. ప్రజల వ్యక్తిగత గోప్యతను హరించిన కేసీఆర్‌కు మళ్లీ ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. "కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే లక్షల మంది ఫోన్లపై నిఘా పెడతారు. ప్రజల ఫోన్లపై నిఘా పెట్టి ఎవరెవరు ఓటు వేయలేదో తెలుసుకొని వేధిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ఫోన్ ట్యాపింగ్ రాక్షసక్రీడలో ఎంతోమంది బలైపోయారు. వ్యవస్థీకృతంగా క్రూరమైన నేరం చేసిన వాళ్లు మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారు. జడ్జీలు, జర్నలిస్టులు, నటులు, రాజకీయ నేతలు ఇలా అన్ని వర్గాల ఫోన్లను ట్యాప్ చేశారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది"అని అన్నారు.

## సంపాదకీయం

మంగళవారం, జూన్ 02, 2026

### జెన్ జీ గేమ్ ఛేంజర్ అవుతుందా

సమకాలీన రాజకీయాల మీద.. వర్తమాన అంశాల మీద విశ్లేషణలు ఒక యాంగిల్ లో బాగుంటుంది. మరొక యాంగిల్ లో విమర్శలకు కారణమవుతూ ఉంటుంది.దక్షిణాసియా వ్యాప్తంగా జనరేషన్ జెడ్ ఎదుగుదల రాజకీయాలను పూర్తిగా మారుస్తోంది. సుమారుగా 1990 దశకం చివరి నుండి 2010ల మధ్య జన్మించిన జెన్ జీ, పూర్తిగా స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా యుగంలో పెరిగిన మొదటి తరం. గత తరాలలాగ కాకుండా, వీరు రాజకీయ పార్టీల పట్ల తక్కువ నమ్మకం కలిగి ఉంటారు. కేవలం సమస్యలను బట్టి వీరి ఆలోచనా దృక్పథం ఉంటుంది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఎక్కువగా కనెక్ట్ అయి ఉంటారు. ఇప్పటికే బంగ్లాదేశ్, నేపాల్ వంటి పొరుగు దేశాలలో ప్రభుత్వాలను జెన్ జీ కుదిపేసింది. ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కులైన జనాభాను కలిగిన దేశాలలో భారత్ ఒకటి. ఇక్కడ కూడా జెన్ జీ ఒక ప్రధాన రాజకీయ శక్తిగా మారగలదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమిళనాడులో నటుడు జోసెఫ్ విజయ్ సాధించిన విజయం ఈ చర్చను మరింత తీవ్రతరం చేసింది. అతని విజయం చాలా మంది సాంప్రదాయ రాజకీయ నాయకులను ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే ఇది పాత ఎన్నికల సూత్రాలను సవాలు చేసింది. విజయ్ సాంప్రదాయ ప్రచారాల కంటే డిజిటల్ ప్రచారం, యువతను ఆకర్షించడంపై ఫోకస్ చేశారు. దశాబ్దాలుగా ఉన్న పార్టీల నుంచి విమర్శలు, వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, పెద్ద సంఖ్యలో యువ ఓటర్లు అతనికి మద్దతు తెలిపారని ఎన్నికల అనంతర విశ్లేషణలు తెలుపుతున్నాయి. భారత్‌లో పెరుగుతున్న జెన్ జీ రాజకీయ ప్రభావానికి ఇది నిదర్శనమని చాలా మంది పరిశీలకులు భావించారు.దేశవ్యాప్తంగా రాజకీయ నాయకులు మారాలని.. కచ్చితంగా విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. ఒక యాంగిల్ లో ఇది కరెక్ట్. బంగ్లాదేశ్లో.. నేపాల్ ప్రాంతంలో ఉద్యమాలు వచ్చిన విషయం కూడా కరెక్టే. కానీ బంగ్లాదేశ్లో ప్రభుత్వం ఏ స్థాయిలో ప్రజల కోసం పనిచేస్తుంది.. నేపాల్ లో అక్కడి ప్రధాని ఏ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.. పార్లమెంట్ సమావేశం జరుగుతుంటే మధ్యలో నుంచి వెళ్లిపోయారు.. ఇటువంటి జన్ జెడ్ నాయకత్వం ఏ మేరకు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతోంది..యువతలో ఆవేశం ఉంటుంది కరెక్టే.. కానీ ఆవేశం ఆలోచనను తొక్కిపడేస్తుంది కదా.. తాత్కాలిక ఆగ్రహాలు వేరు.. శాశ్వత ఆలోచనలు వేరు. నరేంద్ర మోడీ యువతతో కనెక్ట్ అవుతున్నారు. అలాగని యువత మాత్రమే నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకోవడం లేదు. ఈ దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉంది కాబట్టి.. యువత ఆకాంక్షలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం యువతరం ఆవేశంలోనే రాజకీయ పార్టీలు పాలిటిక్స్ చేస్తే.. మిగతా వర్గాల ప్రజలు ఏమైపోవాలి.. వారు ఎక్కడికి వెళ్లాలి..ఏ ప్రభుత్వానికి అయినా సరే ప్రజలను పూర్తిగా సంతృప్తి పరిచే అవకాశం ఉండదు. ఎందుకంటే ప్రజల్లో భిన్న వర్గాలు ఉంటారు . వారి ఆకాంక్షలు వేరే విధంగా ఉంది. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు మాత్రమే చేస్తాయి. ఎందుకంటే అధికారంలో ఉన్న నాయకుల దగ్గర మంత్రదండాలు ఉండవు. ఇక ఈ తరం యువత విషయానికి వస్తే.. వారు సోషల్ మీడియా ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. ప్రతిదీ కూడా క్షణాల్లోనే జరిగిపోవాలని అనుకుంటున్నారు. కానీ ఇక్కడ సీనియర్ జర్నలిస్టులు తెలుసుకోవాల్సిన విషయం ఒకటి ఉంది.ఆ యువత కూడా ఒక్క రోజులోనే యుక్త వయసుకు రాలేదు. అనేక పరిణామాలు.. అనేక దశలను దాటుకుని ఇక్కడ దాకా వచ్చారు. ప్రభుత్వంలో కావచ్చు.. పరిపాలన విధానంలో కావచ్చు లోపాలు ఉంటే ఉండవచ్చు. లోపాలు లేవని చెప్తే అది బూతు అవుతుంది. రాజకీయాలు కూడా పూర్తి వ్యాపారమయం గా మారిపోయాయి.. అందువల్లే ఎవరూ ప్రజలకు సేవ చేయాలని అనుకోవడం లేదు. ప్రజలు మాత్రం డబ్బులు స్వీకరించకుండానే ఓట్లు వేస్తున్నారా.. తమిళనాడు ఎన్నికల్లో కూడా డబ్బులు తీసుకొని ఓట్లు వేశారు. విజయ్ పార్టీ ఎన్నికల్లో డబ్బులు పంచక పోయి ఉండవచ్చు. కానీ అధికారాన్ని దక్కించుకునే క్రమంలో పుష్ప స్టైల్ లో సోఫాలు పంపిణీ చేసిన విషయాన్ని మర్చిపోకూడదు కాక్రోచ్ పార్టీలు మఘ లో పుడతాయి.. పుబలో ముగిసిపోతాయి. ఈ దేశంలో అన్న హజారే కాంగ్రెస్ గవర్నమెంటు అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం చేశారు. నాడు యువత కూడా ఆయనకు అండగా నిలిచింది. ఆ తర్వాత ఆ ఉద్యమం ఏమైపోయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముందుగానే చెప్పినట్టు ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు.. ఆలోచనతో తీసుకునే విధానాలు వేరుగా ఉంటాయి. కేవలం యువత ఆవేశాన్ని పరిగణనలోకి తీసుకొని రాజకీయాలు చేయడం అంటే.. కుక్కతోక పట్టుకొని గోదావరిని ఈదినట్టే ఉంటుంది.ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ వ్యవస్థలలో భారతదేశం ఒకటి. వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా మిలియన్ల మంది ఉచిత రేషన్ ప్రయోజనాలు, వైద్యంలో రాయితీ, స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్‌లు, ఆర్థిక సహాయాన్ని పొందుతున్నారు. ఇటువంటి విస్తృతమైన సంక్షేమ నిర్మాణాలు పూర్తి రాజకీయ పతనానికి దారితీసే అవకాశాలను తగ్గిస్తాయి. రాజకీయ అధికారం కూడా విస్తృతంగా ఉంటుంది. పార్లమెంటు నుండి గ్రామ పంచాయతీల వరకు క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతాయి. మిలియన్ల మంది ఎన్నికైన ప్రతినిధులు పాలనలో పాల్గొంటారు. ఈ లోతైన ప్రజాస్వామ్య నిర్మాణం ప్రజలు తమ అసంతృప్తిని పూర్తిగా తిరస్కరించకుండా వ్యక్తం చేయడానికి వారికి అవకాశాలు కల్పిస్తుంది. మరో ప్రధాన వ్యత్యాసం భారత సంస్థల స్థిరత్వం. పలు పొరుగు దేశాలలాగ కాకుండా, భారత సైన్యం పూర్తిగా కేంద్రం నియంత్రణలో ఉంది. న్యాయవ్యవస్థలో జాప్యంపై తరచుగా విమర్శలు వస్తున్నప్పటికీ, చాలా మంది పౌరులు ఇప్పటికీ రాజ్యాంగ సంస్థలు, ఎన్నికలపై నమ్మకాన్ని కలిగి ఉన్నారు.భారతదేశంలో వైవిధ్యం కూడా ఒక కారకంగా పనిచేస్తుంది.

**- ఎడిటర్**

# మళ్లీ తెలంగాణ సెంటిమెంట్

హైదరాబాద్ జూన్ 1, (న్యూస్ పల్స్) తెలంగాణలో మరోసారి పాత ప్రాంతీయ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించే ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి దశాబ్దం క్రితం నాటి ఉద్యమ కాలపు భావోద్వేగాలను మళ్లీ రగిల్చి, రాబోయే ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా తెరవెనుక వ్యూహాలు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తోంది. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై చేసిన ఒక విశ్లేషణ, దానికి ఏపీ నేతల నుంచి వచ్చిన ప్రతిస్పందనల చుట్టూ ఇప్పుడు తెలంగాణలో పెద్ద రాజకీయ వివాదమే నడుస్తోంది. తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంగా మలిచేందుకు ఒక వర్గం గట్టి ప్రయత్నాలు చేస్తోంది.ముఖ్యంగా ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను టార్గెట్ చేస్తూ సాగుతున్న ఈ పరిణామాలు.. రాబోయే స్థానిక సంస్థలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం పొలిటికల్ గ్రౌండ్ సిద్ధం చేసుకునే వ్యూహంలో భాగమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏపీ రాజకీయాలపై విశ్లేషణలు చేయడం ఇదేం మొదటిసారి కాదు. అయితే ఈసారి ఆయన వ్యాఖ్యలపై ఏపీ నేతలు స్పందించిన తీరును సాకుగా చూపి, కొందరు నేతలు దీనిని తెలంగాణ సమాజంపై దాడిగా చిత్రీకరిస్తున్నారు. ఏపీ నేతలు తెలంగాణ మేధావులను, వ్యక్తులను గౌరవించడం లేదనే భావనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా పాత సెంటిమెంట్‌ను రగిల్చవచ్చని భావిస్తున్నారు.ఈ వివాదంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు నేరుగా మైకుల ముందుకు వచ్చి మాట్లాడకపోయినప్పటికీ, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగాలు మాత్రం అత్యంత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గతంలో తెలంగాణపై చేసిన వ్యాఖ్యలను, చంద్రబాబు పాత రాజకీయాలను తవ్వి తీస్తూ రీల్స్, పోస్టులతో హోరెత్తిస్తున్నారు. నేరుగా విమర్శిస్తే ప్రజల్లో వచ్చే నెగెటివ్ ఇంపాక్ట్‌ను నివారించేందుకు, సోషల్ మీడియా ద్వారా సెంటిమెంట్ మంటను రాజేసే బాధ్యతను కింది స్థాయి కేడర్‌కు అప్పగించినట్లు స్పష్టమవుతోంది.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసి, టీడీపీ సానుభూతిపరులకు, సెటిలర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. దీనికి విరుగుడుగా ఇప్పుడు విపక్షాలు నాగేశ్వర్ ఇష్యూను చేతుల్లోకి తీసుకున్నాయి. తెలంగాణ గడ్డపై ఏపీ నేతల పెత్తనం ఏంటి? అనే పాత నినాదాన్ని మళ్లీ తెరపైకి తెస్తూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏపీ ప్రయోజనాల పరిరక్షకుడిగా, ఏపీ నేతలకు లొంగిపోయిన సర్కార్‌గా ముద్ర వేసే ప్రయత్నం జరుగుతోంది.ముఖ్యంగా పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా ఆయన అభిమానులను రెచ్చగొట్టి, తద్వారా వచ్చే ఘర్షణ వాతావరణాన్ని రాజకీయంగా వాడుకోవాలనేది ఈ 'షాడో పాలిటిక్స్' అసలు ప్లాన్ అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని సెటిలర్ల ఓటు బ్యాంకును చీల్చడం లేదా ప్రభావితం చేయడమే దీని వెనుక ఉన్న బలమైన వ్యూహం. దశాబ్దం క్రితం ఉన్నంత తీవ్రస్థాయిలో ఇప్పుడు సెంటిమెంట్ రాజకీయాలు పనిచేస్తాయా అనేది పెద్ద సందేహమే. గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెరిగాయి. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య వ్యాపార, వాణిజ్య లావాదేవీలు విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నాయి. నేటి తెలంగాణ యువత కేవలం సెంటిమెంట్ వైపు కాకుండా ఉద్యోగాలు, ఐటీ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు మరియు సంక్షేమం గురించి ఆలోచిస్తోంది. కేవలం వ్యక్తుల మధ్య జరిగే మాటల యుద్ధాన్ని ప్రాంతీయ పోరాటంగా మార్చాలని చూస్తున్న రాజకీయ శక్తుల ఉద్దేశాన్ని సామాన్య ప్రజలు సైతం గమనిస్తున్నారు. ఏపీ రాజకీయాలపై నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలకు సమాధానం అక్కడి నుంచే రావాలి కానీ, అజెండా నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ఈ పవన్-బాబు టార్గెట్ పాలిటిక్స్ రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. అయితే, ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్న తరుణంలో.. కేవలం సెంటిమెంట్‌ను నమ్ముకుని చేసే ఈ కృత్రిమ రాజకీయాలు ఎంతవరకు ఫలిస్తాయో కాలమే నిర్ణయించాలి.

## తెలుగు రాష్ట్రాల్లో సిజేరియన్ల జోరు

నిజామాబాద్, జూన్ 1, (న్యూస్ పల్స్)భారతదేశంలో సిజేరియన్ (సి-సెక్షన్) ప్రసవాల సంఖ్య ఏటా ఊహించని విధంగా పెరుగుతోంది. వైద్యపరంగా అత్యవసర పరిస్థితుల్లో తల్లీ, బిడ్డల ప్రాణాలను రక్షించడానికి చేసే ఈ శస్త్రచికిత్స.. ప్రస్తుతం దేశంలో ఒక సాధారణ ప్రక్రియగా మారిపోతోందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ఒక ప్రాంతంలో సి-సెక్షన్ ప్రసవాల రేటు 10 నుండి 15 శాతం లోపు మాత్రమే ఉండాలి. కానీ, భారతదేశంలో ఈ సంఖ్య సగటున 27.2 శాతానికి చేరుకుంది.ఈ నివేదిక ప్రకారం, దేశంలోనే అత్యధికంగా సి-సెక్షన్ ప్రసవాలు జరుగుతున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. తెలంగాణలో దాదాపు 62.2 శాతం ప్రసవాలు శస్త్రచికిత్సల ద్వారానే జరుగుతున్నాయి. అంటే రాష్ట్రంలో పుడుతున్న ప్రతి 10 మంది పిల్లలలో ఆరుగురు సి-సెక్షన్ ద్వారానే జన్మిస్తున్నారు. దీని తర్వాత పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ 52.2 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. దీనికి విరుద్ధంగా నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలలో అత్యల్పంగా 13.2 శాతం సి-సెక్షన్ రేటు నమోదైంది.ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే ప్రైవేట్ హెల్త్‌కేర్ సెంటర్లలో సి-సెక్షన్ల రేటు అత్యంత ఆందోళనకరంగా ఉంది. తెలంగాణలోని ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాలలో ఏకంగా 83.9 శాతం సిజేరియన్లే కావడం గమనార్హం. జాతీయస్థాయిలో ప్రైవేట్ ఆసుపత్రుల సగటు 54.1 శాతంగా ఉంది. అదే సమయంలో తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా సి-సెక్షన్ రేటు 48.1 శాతంగా నమోదైంది. ఇది జాతీయ ప్రభుత్వ ఆసుపత్రుల సగటు (16.9శాతం) కంటే మూడు రెట్లు ఎక్కువ.నొప్పి భరించలేకపోవడం, నిర్దిష్టమైన ముహూర్తాల కోసం ప్రసవాలు ప్లాన్ చేసుకోవడం, గర్భధారణ వయసు పెరగడం, ఆసుపత్రుల వాణిజ్య ధోరణులు సి-సెక్షన్లు పెరగడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అయితే, వైద్యపరమైన అవసరం లేకుండా సిజేరియన్లు చేసుకోవడం వల్ల తల్లులలో ఇన్ఫెక్షన్లు, అధిక రక్తస్రావం వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, శిశువులలో రోగనిరోధక శక్తి తగ్గే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిపై జాతీయ స్థాయిలో కఠినమైన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## టిమ్స్ మార్చురీ తరలించాలి

**పలు కాలనీల ప్రజల ఆందోళన**

**దుర్వాసనలు, అంబులెన్స్ శబ్దాలు, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది**

**ప్రజల మానసిక ప్రశాంతతకు భంగం కలుగుతుంది**

**ఆసుపత్రి సేవలకు వ్యతిరేకం కాదు,స్థానికుల ఇబ్బంది కలుగద్దు**

**మార్చురీ సమీపంలో ప్రభుత్వ స్కూల్స్, కాలేజీ ఆరోగ్య కేంద్రం,ప్రభుత్వ కార్యాలయాలు**

**దుర్వాసనలు, అంబులెన్స్ శబ్దాలు, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది**

**ప్రజల మానసిక ప్రశాంతతకు భంగం కలుగుతుంది**

**ఆసుపత్రి సేవలకు వ్యతిరేకం కాదు,స్థానికుల ఇబ్బంది కలుగద్దు**

**సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహకు కాలనీ వాసుల విజ్ఞప్తి**

సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో శవాలను భద్రపరిచే మార్చురీని తరలించాలని పలు కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.సనత్ నగర్ టీమ్స్ ఆస్పత్రి లో నిర్మించిన శవాలను భద్రపరిచే మార్చురీని వెంగళరావునగర్ కాలనీ ప్రధాన రోడ్డును ఆనుకొని నిర్మించారు,మార్చురీ చుట్టుపక్కల సిద్ధార్థ నగర్ మధుర నగర్,కళ్యాణ్ నగర్ కాలనీలతో పాటు జవహర్ నగర్,వికాస్ పూరి కాలనీలు ఉన్నాయి అంతేకాదు సమీపంలోనే రాష్ట్రస్థాయి మహిళ శిశు సంక్షేమ ఆరోగ్య కేంద్రాలు, డ్రగ్ కంట్రోల్ కార్యాలయం, ప్రభుత్వ,ప్రైవేటు స్కూల్స్ కాలేజీలు ఉన్నాయి.అంతే కాదు వెంగళ్ రావు నగర్ చౌరస్తా నుంచి రాజీవునగర్,మోతినగర్ మీదుగా బోరబండ వరకు ప్రధాన మార్గం,కృష్ణకాంత్ పార్క్ మీదుగా జూబ్లీహిల్స్ వైపు ప్రధాన మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రాంతంలో ప్రజల జీవనం సాగిస్తారు అలాంటి ప్రదేశంలో శవాలను భద్రపరిచే గది మార్చురిని ఏర్పాటు చేయడం పట్ల కాలనీవాసులతోపాటు వైద్య శాఖలో పనిచేసే ఉద్యోగులు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో మార్చురీ ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు పలు సమస్యలు తలెత్తుతాయని ముఖ్యంగా దుర్గంధం,దుర్వాసనతో పాటు రాత్రి పగలు అంబులెన్స్ శబ్దాలు.... చనిపోయిన వారి కుటుంబాల ఆర్తనాధానాలతో ఈ ప్రాంతమంతా భయానకంగా మారుతుందని చుట్టుపక్కల కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వెంగళ్ రావు నగర్ ప్రధాన రహదారి పక్కన, నివాస ప్రాంతానికి సమీపంలో మార్చురీ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోనే ఇతర ఖాళీ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు అధికంగా నివసిస్తున్న ప్రాంతానికి ఆనుకుని మార్చురీ నిర్మాణాన్ని చేపట్టడం సరికాదని కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు అంటున్నారు.ఈ అంశంపై గత కొన్ని నెలలుగా ఆసుపత్రి అధికారులు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి స్పష్టమైన చర్యలు కనిపించలేదని కాలనీ ప్రతినిధులు తెలిపారు. మృతదేహాల రవాణా వాహనాల రాకపోకలు, ప్రజారోగ్య సమస్యలు, మానసిక ఇబ్బందులు తలెత్తే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మార్చురీని ఆసుపత్రి ప్రాంగణంలోనే ప్రజలకు ఇబ్బంది కలగని అనువైన ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.ఆసుపత్రి సేవలను లేదా వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధిని తాము వ్యతిరేకించడం లేదని, ప్రజల జీవన నాణ్యతకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని మాత్రమే కోరుతున్నామని స్థానికులు అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ,వైద్య శాఖ ఉన్నతాధికారులు జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని పలు కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడి నుండి శవాలను భద్రపరిచే మార్చురిని తరలించకపోతే అన్ని కాలనీల ప్రజలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఆందోళనలతో పాటు న్యాయపోరాటం చేస్తామని కాలనీలో సంక్షేమ సంఘాల ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో

వేములవాడ ,రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడంతో విద్యార్థులు తిరిగి పాఠశాలలు,హాస్టళ్లకు వెళ్లే ముందు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఉదయం నుంచే భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే రుద్రాభిషేకం, అన్నపూజ, నిత్య చండీహోమం, నిత్య కల్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, లింగార్చన, ఆకుల పూజ తదితర విశేష పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ ఈవో ఎల్. రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి, ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం, కోడె మొక్కుల క్యూలైన్ల వద్ద ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలపై అధికారులను ఆదేశించారు.

## జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే విద్యతోనే సాధ్యం


**ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలోకంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మడ్ ఫోర్ట్ పాఠశాలలో అభినందన సభ**

శ్రీగణేష్ ఫౌండేషన్ తరపున కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 45 మంది ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులకు మడ్ ఫోర్ట్ పాఠశాలలో సోమవారం అభినందన సభ నిర్వహించి మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన మీరంతా నియోజకవర్గానికి గర్వకారణమని, విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, కంటోన్మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. మీ విద్యాభివృద్ధికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు అందులో భాగమేనని, డబ్బు లేదని ఏ పేద విద్యార్థి చదువు ఆపకూడదనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పేద విద్యార్థులకు మంచి కళాశాలలలో సీట్లు ఇప్పించడానికి తాను కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇ ఓ విష్ణు వర్ధన్, కో ఆర్డినేటర్ షెడ్రక్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులపై సీఐడీ కీలక ఆపరేషన్.. 11 మంది అరెస్ట్

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులపై తెలంగాణ సీఐడీ కీలక ఆపరేషన్ చేపట్టింది.. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమింగ్ నిర్వహిస్తున్న 11 మందిని అరెస్ట్ చేసిన సీఐడీ అధికారులు నిందితుల్లో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలు ఉన్నట్లు గుర్తించినట్టు సమాచారం. అరెస్టు అయిన వారిలో నిర్వాహకులు వారి సహాయకులు ఉన్నట్లు గుర్తించారు. . నిందితుల నుంచి భారీగా బెట్టింగ్ నిర్వాహణకు వినియోగించే పరికరాలు, మొబైల్స్, లాప్టాప్స్ స్వాధీనం చేసుకున్నారు. మరికాసేపట్లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.ఈ విషయమై సీఐడీ చీఫ్ చారు సిన్హా మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం ఆన్ లైన్ బెట్టింగ్‌పై సిట్ ఏర్పాటు చేసిందని..ఆన్ లైన్ బెట్టింగ్ కేసులను అంఐకి బదిలీ అయిన కేసులను విచారణ చేస్తున్నామని అంఐ చీఫ్ చారు సిన్హా ప్రకటించారు. కరీంనగర్‌లో నమోదైన డాఫా బెట్ కేసును అంఐ ఛేదించింది. 46 మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ ను సీజ్ చేశాం.ఈ కేసులో ఆన్ లైన్ బెట్టింగ్ ద్వారా ఆర్గనైజర్లు రోజుకు 8 నుండి 10 లక్షలు సంపాదిస్తున్నారు.40 మంది అధికారులు ఈ కేసును విచారణ చేశారు. 15 రోజుల అంఐ ఆపరేషన్ లోఢిల్లీ, గుజరాత్, పంజాబ్ లో 11 మందిని అరెస్ట్ చేశారు.ఇది ఒక ఇంటర్నేషనల్ బెట్టింగ్ దందా.ఆన్ లైన్ బెట్టింగ్ కేసులో పాన్ ఇండియా ఆపరేషన్ చేసి నిందితులను అరెస్ట్ చేశాము.ఈ డాఫా బెట్ పై 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు 73 క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని చారుసిన్హా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్లైన్ బెట్టింగ్ అప్లికేషన్లపై 414 కేసులు నమోదు చేసిన సీఐడీ108 ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్ గుర్తించి భారత ప్రభుత్వ ప్రతిపాదనలు పంపిన సీఐడీఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల సమన్వయంతో 37 ఆన్లైన్ బెట్టింగ్ అప్లికేషన్లు తెలంగాణలో మాత్రమే అందుబాటులో ఉండేలా జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిందన్నారు. 25 మంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లలను కౌన్సిలింగ్ చేసిన సీఐడీ ఆన్ లైన్ బెట్టింగ్ ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలు , ఇన్ఫ్లుయెన్సర్లకు ఒక్క చాన్స్ ఇచ్చాం. వారికి కౌన్సెలింగ్ చేశాము. రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలో 414 కేసులు నమోదు, 108 బెట్టింగ్ యాప్ లు బ్లాక్ చేశామన్నారు.



# విజయాన్ని శాసించే సెటిలర్ల ఓటు

హైదరాబాద్, జూన్ 1, (న్యూస్ పల్స్) హైదరాబాద్ రాజకీయాలు మళ్లీ ఒక ఆసక్తికర మారాయి. రోడ్లు, డ్రైనేజీలు, ట్రాఫిక్, మూసీ ప్రక్షాళన, చెరువుల ఆక్రమణలు వంటి పట్టణ సమస్యలపై జరగాల్సిన చర్చ నెమ్మదిగా ఐడెంటిటీ పాలిటిక్స్ వైపు మళ్లుతోందా? ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు చూస్తే అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి.అమీర్‌పేట చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు చుట్టూ సాగిన చర్చ, తెలంగాణ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ - ఏపీ డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన మాటల యుద్ధం, సోషల్ మీడియాలో మళ్లీ తెరపైకి వచ్చిన తెలంగాణ-ఆంధ్ర భావోద్వేగాలు... ఇవన్నీ చూడటానికి విడివిడిగా కనిపించినా, ఉఊఓఅ ఎన్నికల కోనంలో చూస్తే ఒక పెద్ద రాజకీయ వ్యూహంలో భాగమే అని అనిపిస్తోంది. ఎన్నికలు ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, రాజకీయ పార్టీలు ఇప్పటికే హైదరాబాద్ ఓటరు మనస్తత్వాన్ని అంచనా వేసే పనిలో పడ్డాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పోరు ఉఊఓఅ ఎన్నికలే. రాష్ట్ర జనాభాలో కీలక భాగం హైదరాబాద్‌లో నివసిస్తోంది. రాష్ట్ర ఆదాయంలోనూ, రాజకీయ ప్రభావంలోనూ, మీడియా దృష్టిలోనూ హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం హైదరాబాద్‌ను గెలుచుకోవడం అంటే కేవలం కార్పొరేషన్‌ను గెలుచుకోవడం కాదు. అది ఓ పొలిటికల్ నరేటివ్ ను సృష్టించడం. అందుకే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలూ ఉఊఓఅని ప్రతిష్ఠాత్మక పోరుగా చూస్తున్నాయి.తంలో టీడీపీ బలంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్, తర్వాత బీఆర్ఎస్‌కు కోటగా మారింది. అదే జీహెచ్ఎంసీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారికి అనుకూలంగా మారింది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే అందుకు నిదర్శనం. మరోవైపు బీజేపీ నగరంలో తన బలాన్ని క్రమంగా పెంచుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటోందితెలంగాణ ఉద్యమ కాలంలో తరచుగా వినిపించిన "తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వం" వాదనకు ఎదురుగా "తెలుగు జాతిఉమ్మడి వారసత్వం" అనే వాదన మళ్లీ వినిపించింది. ఎన్టీఆర్ కేవలం ఆంధ్రప్రదేశ్ నాయకుడా? లేక మొత్తం తెలుగు జాతికి చెందిన నేతా? అనే చర్చలు కూడా జరిగాయి. తెలంగాణలో ఆంధ్ర పార్టీ నాయకుడి విగ్రహమెందుకని పాశం యాదగిరి లాంటి ఉద్యమకారులు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు తీవ్రచర్చకు దారి తీసింది. వాస్తవానికి ఎన్టీఆర్ ను తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్, బీఆరెస్ ఎవరూ బహిరంగంగా ఓన్చేసుకోలేని పరిస్థితి. రేవంత్ మాత్రం తన ఓపెన్ గా తీసుకున్న నిర్ణయం ఇక్కడి సెటిలర్ ఓటర్లకు నచ్చుతుంది. అదే సమయంలో వ్యతిరేకులనూ ఆకట్టుకునే ప్రయత్నాలు ఇతర పార్టీలు చేయొచ్చు. ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వర్ మరియు పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన వివాదం కూడా తెలంగాణ-ఆంధ్ర చర్చను మరోసారి తెరమీదకు తెచ్చింది. తెంలగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మందుల సామేలు.. అనిరుధ్ రెడ్డిలు చేసిన వ్యాఖ్యలు, జనసేన అభిమానులు ప్రెస్ క్లబ్ లో చేసిన ప్రకటనలు పరిస్థితిని కాస్త ఉద్రిక్తంగానే మార్చాయి. కొందరు దీనిని తెలంగాణ మేధావి వర్గం వర్సెస్ ఆంధ్ర రాజకీయ ప్రభావం కోణంలో చూడగా, మరికొందరు పత్రికా స్వేచ్ఛ వర్సెస్ ఫ్యాన్ ఫేర్ అనే కోణంలో విశ్లేషించారు. ఈ వివాదం కొన్ని రోజులుగా సోషల్ మీడియా అజెండాను పూర్తిగా ఆక్రమించింది. ముఖ్యంగా యువతలో, రాజకీయంగా చురుకుగా ఉండే వర్గాల్లో ఈ చర్చ బలంగా సాగుతోంది. తెలంగాణ ఆవిర్భావం తొలుత ఊహించినంత వైరం ఏమీ ఏర్పడలేదు పైగా ఏపీ పెట్టుబడిదారులు మాకు ముఖ్యం అనికేసీఆర్ స్వయంగా ప్రకచించారు కూడా . తర్వాత క్రమంగా అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాలు, పెట్టుబడులు వంటి అంశాలు ప్రధాన చర్చగా మారాయి. కానీ ఇటీవల కొన్ని పరిణామాలు చూస్తే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంటు ప్రధానాంశం కాబోతోందా అనికూడా అనిపించకమానదు. సోషల్ మీడియాలో తెలంగాణ వాదులు, ఆంధ్ర వాదులు అంటూ ఓపెన్ కాలింగ్ మొదలైంది. దాంతో ఇది ఎన్నికల ముందు సహజ రాజకీయ ప్రక్రియేనా? లేక పార్టీల వ్యూహాత్మక ప్రచారంలో భాగమా? అనుమానం కలగక మానదు.హైదరాబాద్ రాజకీయాల్లో "సెటిలర్ ఓటు" అనే పదం కొత్తది కాదు. ముఖ్యంగా కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షలాది మంది ఓటర్లు నగర ఎన్నికల్లో ప్రభావం చూపే స్థాయిలో ఉన్నారు. ఈ వర్గం ఎటు మొగ్గుచూపితే అటే సీట్లు గెలుస్తారనేది గణాంకాలు చెప్తున్నాయి. ఐతే వీరు తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీవైపే మొగ్గుచూపుతారు అనే మరో విశ్లేషణ కూడా సాగుతోంది. 2009లో కాంగ్రెస్, 2018లో, 2023లో బీఆరెస్, ఇప్పుడు కాంగ్రెస్ వైపు హైదరాబాద్ ఓటరు మొగ్గుచూపడం ఆసక్తికర పరిణామం. అందుకే ఈ వర్గాన్ని ఆకర్షించగలిగితే నగరంలోని అనేక డివిజన్లలో రాజకీయ సమీకరణాలు మారిపోతాయి. అందుకే ప్రతి పార్టీ ఈ వర్గాన్ని దూరం చేసుకునే ధైర్యం చేయదు.మరోవైపు తెలంగాణ ఉద్యమం

ద్వారా రాజకీయంగా చైతన్యం పొందిన వర్గాలు ఇప్పటికీ ఉన్నాయి. తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ సంస్కృతి, తెలంగాణ చరిత్ర వంటి అంశాలను ప్రాధాన్యంగా చూసే ఓటర్లు కూడా నగరంలో ఉన్నారు. సెట్లర్లు అంటే కేవలం ఏపీ నుంచి వచ్చి స్థిరపడిన వారు మాత్రమే కాదు.. తెలంగాణ జిల్లాలనుంచి వచ్చిన వాళ్ళకూ ఇక్కడ గణనీయ ఓట్లున్నాయి. అందువల్ల ఉఊఓఅ ఎన్నికల్లో కేవలం సెట్లర్ ఓటు మాత్రమే కాదు, తెలంగాణ గుర్తింపు ఓటు కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.అధికార పార్టీగా కాంగ్రెస్ నగర అభివృద్ధిని ప్రధాన అజెండాగా తీసుకెళ్లే అవకాశం ఉంది. అదే సమయంలో సెట్లర్ వర్గాలకు దూరం కాదనే సంకేతాలను కూడా పంపే ప్రయత్నం చేయవచ్చు. అందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన బలం.. రేవంత్ కి ఉన్న తెలుగుదేశం నేపథ్యం, వ్యక్తిగత సంబందాలు ఆ పార్టీకి బలం కానున్నాయి. బీజేపీ ఇప్పటికే నగరంలో బలమైన పట్టు సాధిస్తోంది.. హిందుత్వం, జాతీయతతో పాటు పవన్ కళ్యాణ్ చరిష్మా, తెలుగుదేశం పొత్తును అందుకు అనుకూలంగా వాడుకోబోతోంది. ప్రధాని ఇటీవలి హైదరాబాద్ పర్యటనలో చంద్రబాబు, పవన్ ల ఇంటికి వెళ్లడం, ప్రస్తుత తెలంగాణ - ఆంధ్ర సెంటిమెంటు ద్వారా బీఆరెస్ వ్యతిరేక వర్గాలను ఆకట్టుకునే వ్యూహంలో ఆపార్టీ వుండి. బీఆర్ఎస్‌కు తెలంగాణ గుర్తింపు రాజకీయాలే సహజ బలం. తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని మళ్లీ ప్రజలకు గుర్తు చేస్తూ స్థానిక భావోద్వేగాలను తిరిగి చైతన్యపరిచే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. అదే సమయంలో సెటిలర్లకు తాము వ్యతిరేకం కాదు అని చెప్పుకునే విషయంలో మాత్రం వారికి కత్తిమీద సాముగానే కనిపిస్తోంది. సెట్లర్ల ఓటు రేవంత్ - ఔఆం కూటమి మధ్య చీలితే ఏదైనా లాభం వస్తుందేమో అనే ఆశల్లో కూడా ఆ పార్టీ ఉంది. రాబోయే ఉఊఓఅ ఎన్నికల్లో అసలు నరేటివ్ దేనిపై అన్న స్పష్టత మాత్రం ఇంకా రాలేదు.. మూసీ ప్రక్షాళన పై అభ్యంతరాలు, హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలు, వరదల నిర్వహణపై జరుగుతుందా? లేక తెలంగాణ అస్తిత్వం, ప్రాంతీయ భావోద్వేగాలపై జరుగుతుందా? అనేది తేలే కీలక దశలో మనమున్నాం. ఇప్పటివరకు జరిగిన పరిణామాలు చూస్తే రెండు అంశాలూ సమాంతరంగా నడుస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఉఊఓఅ ఎన్నికలు అధికారికంగా ఇంకా ప్రకటించకపోయినా ఔఖీ విగ్రహం వివాదంపవన్కళ్యాణ్-నాగేశ్వర్ ఎపిసోడ్, సోషల్ మీడియాలో మళ్లీ వినిపిస్తున్న తెలంగాణ-ఆంధ్ర వాదనలు... ఇవన్నీ ఎన్నికల అజెండాను ప్రభావితం చేసే అంశాలుగా మారే అవకాశం ఉంది.

# అందుబాటులోకి రానున్న పాలిమర్ నోట్లు

ముంబై, జూన్ 1, (న్యూస్ పల్స్)భారతీయ రిజర్వ్ బ్యాంక్ దేశంలో కరెన్సీ నిర్వహణ ఖర్చును తగ్గించేందుకు , నోట్ల మన్నికను పెంచేందుకు విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టబోతోంది. త్వరలోనే సాధారణ కాగితపు నోట్ల స్థానంలో ప్లాస్టిక్ నోట్లను ప్రయోగాత్మక ప్రాతిపదికన ప్రవేశపెట్టాలని కేంద్ర బ్యాంకు యోచిస్తోంది. భారతదేశంలో కరెన్సీ నోట్ల ముద్రణ ఖర్చు ఏటా భారంగా మారుతోంది. ఖీఃఎ వార్షిక నివేదిక ప్రకారం, నోట్ల ముద్రణ వ్యయం గత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,101.4 కోట్ల నుండి రూ. 6,372.8 కోట్లకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం చిరిగిపోయిన లేదా పాడైపోయిన నోట్లను ఉపసంహరించుకుని వాటి స్థానంలో కొత్తవి ముద్రించాల్సి రావడమే. కేవలం ఒక్క ఏడాదిలోనే సుమారు 23.8 బిలియన్ల పాత నోట్లను మార్కెట్ నుండి వెనక్కి తీసుకున్నారు. ఇందులో రూ. 500. రూ. 100 నోట్లే అధికంగా ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా పాలిమర్ నోట్లను పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రవేశపెట్టాలని ఆర్‌బీఐ భావిస్తోంది.పాలిమర్ నోట్లు అంటే సింథటిక్ ప్లాస్టిక్ మిశ్రమంతో తయారయ్యే కరెన్సీ. ఇవి సాధారణ కాగితపు నోట్ల కంటే సుమారు 2.5 రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. కాగితపు నోట్లు త్వరగా చిరిగిపోవడం, తడిసిపోవడం లేదా మురికి కావడం వంటి సమస్యలు ఉంటాయి. కానీ, ప్లాస్టిక్ నోట్లు నీటికి తడిసినా ఏమీ కావు, వీటిని అంత సులభంగా చించివేయలేము. మన్నిక ఎక్కువగా ఉండటం వల్ల వీటిని పదేపదే ముద్రించాల్సిన అవసరం ఉండదు, ఫలితంగా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ముద్రణ ఖర్చు ఆదా అవుతుంది.ప్లాస్టిక్ నోట్లను నకిలీ చేయడం అంత సులభం కాదు. వీటిలో అత్యాధునిక భద్రతా ఫీచర్లు ఉంటాయి. పారదర్శకమైన ప్లాస్టిక్ విండోస్, లోహపు పొరలు అతినీలలోహిత కాంతికి స్పందించే రసాయన గుర్తులు వంటివి ఉండటం వల్ల దొంగ నోట్ల బెడదనుసమర్థవంతంగా అరికట్టవచ్చు. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, వియత్నాం, న్యూజిలాండ్ సహా దాదాపు 45కు పైగా దేశాలు ఈ టెక్నాలజీని విజయవంతంగా వాడుతున్నాయి. సాధారణ కాగితపు నోట్లు పాడైపోతే వాటిని ముక్కలు చేసి భూమిలో పూడ్చివేస్తారు . కానీ, ప్లాస్టిక్ నోట్లు వినియోగానికి పనికిరాని స్థితికి చేరినప్పుడు, వాటిని రీసైకిల్ చేసే అవకాశం ఉంటుంది. వీటిని చిన్న చిన్న బిళ్లలుగా మార్చి, గార్డెన్ ఫర్నిచర్ వంటి ఇతర ప్లాస్టిక్ వస్తువుల తయారీలో ఉపయోగిస్తారు. అంటే, ఇవి ఆర్థికంగానే కాకుండా పర్యావరణ పరంగా కూడా ఎంతో ప్రయోజనకరమని నిపుణులు చెబుతున్నారు. భారతదేశం వంటి భారీ జనాభా ఉన్న దేశంలో నోట్ల చలామణి చాలా వేగంగా జరుగుతుంటుంది. చేతులు మారే కొద్దీ నోట్లు త్వరగా పాడైపోతుంటాయి. ఆర్‌బీఐ ప్రవేశపెట్టనున్న ప్లాస్టిక్ నోట్లు కరెన్సీ నిర్వహణలో పెద్ద మార్పు తీసుకురానున్నాయి. త్వరలోనే ఈ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం కానుందని సమాచారం. ఇదే జరిగితే, మన పర్సుల్లో ఉండే కరెన్సీ నోట్లు ఇకపై చిరగవు, తడవవు.. మరింత కాలం సురక్షితంగా ఉంటాయి!

# గ్రీన్ కార్డులు...అమెరికా యూ టర్న్...

ముంబై, జూన్ 1, (న్యూస్ పల్స్)ఇటీవల అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గ్రీన్ కార్డు దరఖాస్తులకు సంబంధించిన మార్గదర్శకాల్లో మార్పులపై చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసింది. అమెరికాలో ఉంటూ శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వలసదారులు.. ఇకపై తమ స్వదేశానికి వెళ్లి ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుందని తెలిపింది. దరఖాస్తులను కేసు వారీగా అధికారులు పరిశీలించి, ప్రత్యేక మినహాయింపునకు అర్హులా? కాదా? అని అంచనా వేయాలని స్పష్టం చేసింది. దీంతో వలసదారుల్లో ఆందోళన వ్యక్తం కాగా.. యూటర్న్ తీసుకుంది.అమెరికాలో వలసదారులకు శాశ్వత నివాసం హోదా కల్పించే గ్రీన్ కార్డు నిబంధనల విషయంలో డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం వెనక్కి తగ్గింది. గ్రీన్ కార్డు దరఖాస్తు ప్రక్రియను వలసదారులు తమ స్వదేశంలో చేసుకోవాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన విషయం తెలిసిందే. అయితే, పాత విధానం ప్రకారం అమెరికాను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రకటించినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలను వెలువరించింది.ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పులు కాదని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం వివరణ ఇచ్చింది. గ్రీన్‌కార్డు దరఖాస్తుదారుడు అమెరికాలో ఉండి పూర్తిచేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అనేది ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని పేర్కొంది. ఈ నిబంధన చాలాకాలం నుంచి అమల్లో ఉందని తెలిపింది. మే 21న ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశం ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తుచేయడం తప్పా కొత్తదేమీ కాదని డీహెచ్ఎస్ ప్రతినిధి పేర్కొన్నారు. గ్రీన్ కార్డు కోసం వలసదారుల దరఖాస్తుల పరిశీలన జరుగుతున్నప్పుడు కూడా వారు అమెరికాలో ఉండేందుకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. తాజా ప్రకటనతో అమెరికాలో శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకున్న భారతీయులకు భారీ ఊరట లభించినట్టయ్యింది. అమెరికాలో నివసిస్తున్న విదేశీయుల్లో చైనా (52 లక్షలు) తర్వాతి స్థానం భారతీయులదే.వీసా గడువు ముగిసినా దేశంలోనే ఉండిపోవడం లేదా ఇమిగ్రేషన్‌కు సంబంధించిన ఇతర అంశాలను మాత్రం తాము పరిగణనలోకి తీసుకుంటామని సూచనప్రాయంగా తెలిపింది. హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వివరణ ఇచ్చినప్పటికీ.. గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తుచేసిన వలసదారులు ఎటువంటి పరిస్థితుల్లో అమెరికాను విడిచి వెళ్లాల్సిన అవసరం ఉంటుందనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వలసదారుల్లో పలు ప్రశ్నలు మిగిలేఉన్నాయి.గతవారం వెలువరించిన మార్గదర్శకాలపై ఆ శాఖలోని కొంతమంది అధికారులు కూడా వాటి పరిధిపై అనిశ్చితితో ఉన్నారని సమాచారం. ది న్యూయార్క్ టైమ్స్ ప్రకారం.. వైట్ హౌస్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి ఈ చర్యను వలసల వ్యూహంలో ఒక ముఖ్యమైన మార్పుగా కాకుండా, ఒక సాధారణ పరిపాలనాపరమైన విషయంగా అభివర్ణించారు.

## పండుగ వాతావరణంలో పింఛన్ పంపిణీ కార్యక్రమం

### లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందజేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు

కళ్యాణదుర్గం , ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటి సారిగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించిన ఘనత అన్న నందమూరి తారక రామరావు గారు మొదలుపెడితే నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు 4000 రూపాయలకు పెంచి అందిస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. అందులోను మన కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 36504 పింఛన్లు ఉండగా 16.07 కోట్లు అందిస్తున్నామని, లక్ష్మంపల్లి పంచాయతీలో 535 పింఛన్లు ఉండగా 23.77 లక్షలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు..శెట్టూరు మండలం యరబోరెపల్లి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విచ్చేయగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు.

# ఎన్టీఆర్ నామం.. రేవంత్ వ్యూహం



హైదరాబాద్, జూన్ 1, (న్యూస్ పల్స్)ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ఎత్తుగడలు ఎప్పుడూ ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా ఉంటాయి. తాజాగా అమీర్‌పేట మైత్రివనం వద్ద ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఉదంతం కేవలం ఒక విగ్రహావిష్కరణగా కాకుండా, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల కోసం ఆయన వేసిన భారీ రాజకీయ స్కెచ్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉండి, గతంలో ఎన్టీఆర్ తో ఉన్న ఉన్న కాంగ్రెస్ వైరం చరిత్రను పక్కన పెట్టి రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ జపం చేయడం వెనుక బలమైన రాజకీయ కారణం ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన వారు, స్థానికంగా ఉన్న తెలుగుదేశం సానుభూతిపరులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణలో టీడీపీ క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండటంతో, ఆ పార్టీ కోర్ ఓట్ బ్యాంక్ అనాథగా మారింది. ఈ శూన్యాన్ని భర్తీ చేసి, ఆ ఓట్లను కాంగ్రెస్ ఖాతాలోకి మళ్లించడమే రేవంత్ అసలు లక్ష్యం.సాధారణంగా తెలుగుదేశం సానుభూతిపరులు మొదటి నుంచీ కాంగ్రెస్ వ్యతిరేక భావజాలంతో పెరిగిన వారు. ఎన్టీఆర్ పెట్టిన కాంగ్రెస్ వ్యతిరేక పునాదులే వారి రాజకీయ సిద్ధాంతం. మరి అలాంటి వారు కాంగ్రెస్‌కు ఓటు వేయాలంటే, ఆ పార్టీలో తమకు నచ్చిన వ్యక్తి ఉండాలి. రేవంత్ రెడ్డి సరిగ్గా ఆ పల్స్‌ను పట్టుకున్నారు. తాను కాంగ్రెస్ సీఎం అయినప్పటికీ, తన రాజకీయ మూలాలు ఎన్టీఆర్ సిద్ధాంతాల్లోనే ఉన్నాయని, ఇప్పటికీ చంద్రబాబు పట్ల తనకు గౌరవం ఉందని పరోక్షంగా సంకేతాలిస్తున్నారు. చంద్రబాబును ఆయన ఎప్పుడూ వ్యక్తిగతంగా విమర్శించకపోవడం వెనుక ఉన్న అసలు కారణం ఇదే.తెలంగాణలో టీడీపీ క్యాడర్ ఇప్పటికీ రేవంత్ రెడ్డిని మనవాడే అని భావిస్తుంది. ఇప్పుడు మైత్రివనం వంటి అత్యంత రద్దీ ప్రాంతంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా, అటు సెటిలర్లను, ఇటు టీడీపీ అభిమానులను రేవంత్ తన వైపు తిప్పుకున్నారు. మా పార్టీ నాయకుడు కాకపోయినా, మా దైవానికి గౌరవం ఇచ్చారు అనే భావనను టీడీపీ శ్రేణుల్లో కలిగించడంలో రేవంత్ నూటికి నూరు శాతం విజయం సాధించారు. ఎన్టీఆర్‌ను తెలుగు జాతి గర్వకారణం గా కీర్తిస్తూ, ఇటు తెలంగాణ వాదులను ఇబ్బంది పెట్టకుండానే అటు సెటిలర్ల మనసు గెలుచుకుంటున్నారు. దీనివల్ల గ్రేటర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వాడే సెంటిమెంట్ కార్డు ఇకపై పనిచేయదు. పైగా, ఎన్టీఆర్ లేకుంటే కేసీఆర్ ఎక్కడ అని రేవంత్ ప్రశ్నించడం ద్వారా బీఆర్ఎస్ అధినేతను డిఫెన్స్‌లో పడేశారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు రేవంత్ రెడ్డికి అగ్నిపరీక్ష లాంటివి. నగరంలో కాంగ్రెస్ బలపడాలంటే టీడీపీ సానుభూతిపరుల మద్దతు అనివార్యం. అందుకే, ఆయన వ్యూహాత్మకంగా తన ప్రసంగాల్లో ఇందిరా గాంధీతో పాటు ఎన్టీఆర్ పేరును కూడా సమానంగా వాడుతున్నారు. ఎన్టీఆర్ ప్రారంభించిన పక్కా ఇళ్ల పథకమే.. ఈనాటి ఇందిరమ్మ ఇళ్లు అని చెప్పడం ద్వారా రెండు పార్టీల సిద్ధాంతాలను ఒకే తాటిపైకి తెచ్చారు. ఇది రాజకీయంగా రేవంత్ రెడ్డికి అడ్వాంటేజ్ ఇచ్చే అంశం. రాజకీయాల్లో ఏదీ యాదృచ్ఛికం కాదు. రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం వెనుక ఉన్నది కేవలం అభిమానం మాత్రమే కాదు, పక్కాగా లెక్కగట్టిన పొలిటికల్ అరిథ్మెటిక్ . టీడీపీ ఓట్లను కాంగ్రెస్ వైపు తిప్పుకుంటే, గ్రేటర్ హైదరాబాద్‌లో తిరుగులేని శక్తిగా ఎదగవచ్చని ఆయన భావిస్తున్నారు. మరి రేవంత్ వేసిన ఈ విగ్రహ రాజకీయం ఓట్ల రూపంలో ఎంతవరకు మారుతుందో రాబోయే ఎన్నికలు తేల్చనున్నాయి

# చివరి దశకు కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్

వరంగల్, జూన్ 1, (న్యూస్ పల్స్)తెలంగాణలో మరో చారిత్రాత్మక రైల్వే ప్రాజెక్ట్ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. భారతీయ రైల్వేస్ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ రోలింగ్ స్టాక్ తయారీ కేంద్రం నుండి.. రాబోయే ఐదేళ్లలో వందలాది సరికొత్త ఇంటర్‌సిటీ రైళ్లు పట్టాలెక్కబోతున్నాయి. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూలు ఉన్నతాధికారులతో కలిసి ఈ ప్రాజెక్ట్ పురోగతిని పర్యవేక్షించారు. ఇండియన్ రైల్వేస్‌లో కాజీపేట మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఒక బహుముఖ శ్రేణి ఫ్యాక్టరీగా అవతరించబోతోంది. ప్రారంభంలో భాగంగా.. ఈ ఫ్యాక్టరీ నుండి రాబోయే 5 సంవత్సరాలలో 200 అత్యాధునిక ఇంటర్‌సిటీ షటిల్ రైళ్లను తయారు చేయాలని కేంద్ర రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రైళ్లను దేశవ్యాప్తంగా ఉన్న వివిధ నగరాలు, పట్టణాల మధ్య తక్కువ దూర ప్రయాణాల కోసం మోహరించనున్నారు.ఈ సరికొత్త ఇంటర్‌సిటీ రైళ్లు దాదాపు 300 కిలోమీటర్ల పరిధిలో నడుస్తాయి. ఈ ప్రయాణంలో వీటికి ఎక్కువ స్టాపింగ్‌లు ఉంటాయి. దీనివల్ల పక్కపక్కనే ఉండే పట్టణాలు, నగరాల మధ్య నిత్యం ప్రయాణించే సామాన్యులకు ఇవి లో-కాస్ట్ 'షటిల్ సర్వీస్'లా ఉపయోగపడతాయి. పక్క ఊర్లకు వెళ్లి చదువుకునే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే రోజువారీ కూలీలు, వ్యాపారులు, వైద్య అవసరాల కోసం సిటీలకు వెళ్లే సామాన్య ప్రజలకు ఇది అత్యంత చౌకైన, సురక్షితమైన ప్రత్యామ్నాయంగా మారబోతోంది. ఈ రైళ్లు అందుబాటులోకి రావడం వల్ల ప్రస్తుతం రోడ్లపై బస్సులు, సొంత వాహనాల్లో ప్రయాణించే భారీ లోకల్ ట్రాఫిక్ అంతా రైల్వే వైపు మళ్లుతుందని అంచనా వేస్తున్నారు.స్పీడ్ ? కోచ్ కాన్ఫిగరేషన్: ఈ ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల గరిష్ట వేగంతో దూసుకెళ్లేలా డిజైన్ చేస్తున్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయి.జెర్క్ ఫ్రీ టెక్నాలజీ: రైలు ఆగినప్పుడు లేదా స్టార్ట్ అయినప్పుడు ఎలాంటి జర్క్ ఇవ్వకుండా ఉండేలా అత్యాధునిక జెర్క్ ఫ్రీ కుప్లర్లు, బోగీలను అమర్చుతున్నారు. దీనివల్ల ప్రయాణం ఎంతో స్మూత్‌గా సాగుతుంది. సౌకర్యాలు: ప్రయాణికుల రక్షణ కోసం ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ సిస్టమ్, మెరుగైన వెంటిలేషన్, ప్రతి కోచ్‌కి ఇరువైపులా రెండు టాయిలెట్లు ఉంటాయి.పర్యావరణానికి మేలు.. కరెంట్ పుట్టించే రీజనరేటివ్ బ్రేకింగ్ఈ రైళ్లలో ఉన్న మరో మైండ్ బ్లోయింగ్ ఫీచర్.. రీజనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్. ఈ టెక్నాలజీ వల్ల రైలుకు బ్రేకులు వేసిన ప్రతిసారీ.. అది ఒక ఎలక్ట్రిసిటీ జనరేటర్‌గా మారి విద్యార్థుత్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. అలా తయారైన కరెంట్‌ను తిరిగి పవర్ గ్రిడ్‌కే సరఫరా చేస్తుంది. దీనివల్ల ఇవి అత్యంత విద్యుత్ సామర్థ్యం కలిగినవిగా, పర్యావరణహితమైనవిగా మారుతాయి. రోడ్డు రవాణా గాలితో పోలిస్తే కార్బన్ ఉద్గారాలు చాలా తక్కువగా ఉంటాయి




# ఫంక్షన్ హాల్ ను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం

కూకట్ పల్లి,కేపి. హెచ్.బి కాలనీ లో సుమారు 2 వేల కోట్ల రూపాయలు విలువ చేసే భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్ముకొని డబ్బు దండుకున్నాడే తప్ప దానిలో 10 శాతం తన నియోజకవర్గానికి కేటాయిస్తే అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ రెండున్నర ఏళ్ల కాలంలో రాష్ట్రాన్ని నియోజకవర్గాన్ని అభివృద్ధి విషయంలో ముందుకు పోనివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదంటూ ఆరోపించారు. పేదల కోసం తమ ప్రభుత్వంలో కట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ మొత్తం శిథిలావస్థల ఉండడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫంక్షన్ చేసుకునేందుకు నిరుపేదలకు ఉపయోగపడే వీటిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో అధికారులపై అసహనాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ డబ్బులతో కట్టిన భవనాలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు గా ఉంటున్నాయని ఏ అధికారంతో వారు తాళాలను దగ్గర పెట్టుకుంటున్నారని ప్రశ్నించారు. రాజకీయం అంటే ప్రజలకు మంచి చేసి ముందుకెళ్లాల్సిన వీరు నీచమైన శైలిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

## అమరావతిపై కన్నెత్తి చూడని టాలీవుడ్

విజయవాడ, జూన్ 1, అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మొన్నటి వరకు ఏపీ రాజధాని ఏది అంటే చెప్పుకునే పరిస్థితిలో ప్రజలు ఉండేవారు కాదు. కానీ ఇప్పుడు మాత్రం సగర్వంగా చెప్పుకుంటున్నారు అమరావతి అని. అందుకు తగ్గట్టుగానే అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అయితే అమరావతిలో 70 ప్రభుత్వ రంగ సంస్థలు నిర్మితం అవుతున్నాయి. అందులో బ్యాంకులు సైతం ఉన్నాయి. మరో నాలుగు వరకు ప్రైవేటు యూనివర్సిటీలు, ఆస్పత్రుల నిర్మాణం జరుగుతోంది. అయితే అమరావతి ఔన్నత్యాన్ని గుర్తించిన బాలీవుడ్ సంస్థలు అమరావతిలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. భవిష్యత్తులో దక్షిణాది రాష్ట్రాల్లో అమరావతి అద్భుత నగరంగా మారుతుందని అంచనా వేస్తున్నారు బాలీవుడ్ ప్రముఖులు. అందుకే సంజయ్ దత్ లాంటివారు అమరావతికి వచ్చి.. ప్రభుత్వంతో చర్చలు జరిపి తన ఆసక్తిని బయటపెట్టారు. దీనిపై చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ సైతం సానుకూలత చూపారు. అయితే ఆయన ఒక్కరే కాదు బాలీవుడ్ ప్రముఖ సంస్థలు అమరావతిలో తమకు భూములు కేటాయించాలని కోరుతూ దరఖాస్తులు చేసుకుంటున్నాయి. అయితే వాటికి భూముల కేటాయింపుకు సంబంధించి సానుకూల నిర్ణయాలు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.అమరావతి ఔన్నత్యాన్ని బాలీవుడ్ గుర్తించింది కానీ.. టాలీవుడ్ మాత్రం గుర్తించడం లేదు. అసలు ఏపీనే టాలీవుడ్ లెక్కచేయడం లేదు. ఏపీ పాలకుల విషయంలో కూడా అలానే ఉంది చిత్ర పరిశ్రమ పరిస్థితి. ఏపీ సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పలుమార్లు సూచించారు. కానీ ఇంతవరకు తెలుగు చిత్ర ప్రముఖులు వచ్చి సీఎం చంద్రబాబును కలిసిన పరిస్థితి లేదు. కనీసం అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ముందుకు రావడం లేదు తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మావిగన్ అంటూ పిచ్చి ప్రతిపాదన చేస్తోంది. దానిని పట్టించుకునే పరిస్థితి ఎవరికీ లేదు. పైగా ప్రజలు కూడా పెద్దగా ఆహ్వానించడం లేదు. అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కూడా కల్పించింది. దీనిని గుర్తించిన ఎక్కడో ఉన్న బాలీవుడ్ పరిశ్రమ అమరావతికి వచ్చేందుకు సిద్ధపడింది. కానీ ఇక్కడ వ్యాపారం చేసుకుని లాభాలు ఆర్జిస్తున్న టాలీవుడ్ మాత్రం అమరావతి ముఖం చూడడం లేదు. ఇది ఎంత మాత్రం సహేతుకం కాదు. అమరావతి విషయంలో ఇప్పటికైనా తెలుగు చిత్ర పరిశ్రమ ఒక నిర్ణయానికి రావాలి. తెలుగు చిత్ర పరిశ్రమ అంటే హైదరాబాద్ అనే మాట దాటి ఏపీ వైపు విస్తరించాల్సిన అవసరం మాత్రం ఉంది.

## పరుగులు పెడుతున్న పోలవరం పనులు



ఏలూరు, జూన్ 1, పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బహుళార్ధక ప్రాజెక్టుగా గుర్తించబడుతోంది. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాజెక్ట్ వివిధ దశల్లో కొనసాగుతూ వస్తోంది. ప్రతిపాదన స్థాయి నుంచి పూర్తిస్థాయి నిర్మాణం వరకు ఇంత భారీ సమయం తీసుకున్న ప్రాజెక్ట్ దేశంలో చాలా అరుదు. అయినప్పటికీ ఇది రాష్ట్ర అభివృద్ధికి జీవనాడిగా భావించబడుతోంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 2024 నుంచి ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుని వేగంగా పనులు కొనసాగిస్తోంది. ఈ లక్ష్యంతో వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ప్రాజెక్ట్‌లో కీలకమైన భాగమైన ఎడమ కాలువ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. గోదావరి నది (జలాలను ఉత్తరాంధ్ర ప్రాంతానికి తరలించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. ముఖ్యంగా అనకాపల్లి , విశాఖపట్నం ( ప్రాంతాలకు నీటి సరఫరా అందించేందుకు ఈ కాలువ కీలక పాత్ర పోషించనుంది.ఎడమ కాలువలో నేషనల్ హైవేలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జ్ నిర్మాణాలు, ఇతర ఇంజినీరింగ్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.ప్రణాళిక ప్రకారం మరో కొన్ని నెలల్లో ఎడమ కాలువ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత గోదావరి జలాలను అనకాపల్లి వరకు తరలించే ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నారు. ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కాలువను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ పనుల్లో ఆలస్యం జరగకుండా ఉండేందుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. పనుల్లో నిర్లక్ష్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని కూడా సూచించారు.ఇక మరో ముఖ్యమైన ప్రాజెక్ట్ వెలిగొండ ప్రాజెక్ట్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. టన్నెల్-2లో 5.2 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేయడం ఒక కీలక మైలురాయిగా భావించబడుతోంది. హెడ్ రెగ్యులేటర్లు, రిటైనింగ్ వాల్ వంటి నిర్మాణాలు కూడా పూర్తి అయినట్లు సమాచారం.అప్రోచ్ ఛానెల్‌లో ఉన్న మట్టిని తొలగించడం, టన్నెల్-1 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ చివరి నాటికి అవసరమైన ప్రధాన పనులు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనుల ద్వారా రాష్ట్రంలో నీటి వనరుల నిర్వహణ మరింత బలపడనుంది.

## పేకాట శిబిరంపై దాడి..12 మంది అరెస్టు

ఏలూరు,నిఘానేత్రం మూడో కన్ను తెరిచింది. నూజివీడులో పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసారు. గత రెండు నెలలుగా పోలీసులు కళ్ళుగట్టి పేకాట రాయుళ్లు పేకాట స్థావరాలను నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్, రూరల్ సీఐ నాగేంద్ర కుమార్ సిబ్బందితో పేకాట శిబిరంపై మెరుపు దాడి చేసారు. 12 మంది జూదగాళు అరెస్ట్ అయ్యారు. 9 లక్షల 36 వేల రూపాయలు నగదు,21 సెల్‌ఫోన్లు,5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ నాగేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సత్యసాయి జిల్లా హైవే టెండర్లలో రిగ్గింగ్ కలకలం

అనంతపురం జూన్ 1,శ్రీ సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణ టెండర్ల చుట్టూ అలుముకున్న అవినీతి నీడలు ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీకి చేరాయి. ఎన్‌హెచ్-42, ఎన్‌హెచ్-340 రహదారులతో పాటు పలు ఆర్‌ఓబీ ల నిర్వహణ కోసం కేటాయించిన రూ. 10.69 కోట్ల షార్ట్ టర్మ్ మెయింటెనెన్స్ టెండర్లలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండదండలతో కొన్ని నిర్మాణ సంస్థలు కుమ్మక్కై, అర్హత గల కాంట్రాక్టర్లను ఉద్దేశపూర్వకంగా తప్పించడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాను లూటీ చేసేందుకు పక్కా స్కెచ్ వేశాయన్నది ఈ వివాదంలోని ప్రధానాంశం. శ్రీ సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణ ప్రక్రియ పారదర్శకతకు పాతర వేస్తూ సాగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఈ పనుల కోసం టెండర్లు ఆహ్వానించిన తరుణంలో, క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు ఉన్నతాధికారులు ఒక ప్రత్యేక 'రింగ్'గా ఏర్పడ్డారు. తాము అనుకున్న సంస్థలకే ఈ టెండర్లు దక్కేలా, నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రక్రియలో పాల్గొన్న ఇతర సంస్థలను 'టెక్నికల్ గ్రౌండ్స్' పేరుతో అనర్హులుగా ప్రకటించి, పోటీ లేకుండా ఏకపక్షంగా టెండర్లను ముగించేందుకు యత్నించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ మొత్తం వ్యవహారంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ పాత్రపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్ట్ సంస్థలతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, టెండర్ అంచనాలను కృత్రిమంగా పెంచి చూపడం ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లేలా చేశారని ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి రోడ్డు నిర్వహణకు అయ్యే ఖర్చు కంటే అంచనాలను రెట్టింపు చేసి చూపించడం వెనుక పెద్ద ఎత్తున కమిషన్ల పంపిణీ జరిగిందనే సమాచారం వెలుగులోకి వచ్చింది. కొంతమంది నిజాయితీ గల కాంట్రాక్టర్లు బిడ్డింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకోవడం ఈ రిగ్గింగ్‌లో కీలక ఘట్టమని తెలుస్తోంది. కేవలం కాగితాల మీద మాత్రమే పనులు చూపించి, క్షేత్రస్థాయిలో అరకొర పనులతో బిల్లులు డ్రా చేసేలా ఈ టెండర్ల రూపకల్పన జరిగిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రోడ్ల నిర్వహణ పేరుతో అత్యవసరంగా నిధులు మంజూరు చేయించుకుని, ఆ తర్వాత నాణ్యత లేని పనులతో సరిపెట్టేందుకు ఈ నెట్‌వర్క్ సిద్ధమైంది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల నుంచి టెక్నికల్ టీమ్ వరకు అందరూ ఏకమై ఈ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆందోళన నిరుద్యోగ కాంట్రాక్టర్లలో వ్యక్తమవుతోంది. ఇది ప్రజాధనాన్ని నిలువునా దోచుకోవడమేనని స్థానిక నేతలు మండిపడుతున్నారు. ఈ అక్రమాలపై ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ కి , ఆ శాఖ కార్యదర్శికి బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధ రెడ్డి ఫిర్యాదు చేశారు. అత్యంత విలువైన ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా ఉండాలంటే, కేంద్ర విజిలెన్స్ కమిషన్ రంగంలోకి దిగి లోతైన విచారణ జరపాలని డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. టెండర్ల బిడ్డింగ్ ఓపెన్ చేయడానికి ముందే ఈ ప్రక్రియను నిలిపివేసి, ప్రతి అంచనాను మళ్లీ వెరిఫై చేయించాలని బాధితులు కోరుతున్నారు. అవినీతి అధికారుల బండారం బయటపడాలంటే టెక్నికల్ ఆడిట్ ఒక్కటే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.ప్రస్తుతం ఈ ఫైల్ ఢిల్లీలోని ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. ఒకవేళ విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలితే, సంబంధిత అధికారులపై వేటు పడటంతో పాటు టెండర్లను రద్దు చేసే అవకాశం ఉంది. జాతీయ రహదారుల నాణ్యతతో రాజీపడి, ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ సాగుతున్న ఈ రిగ్గింగ్ మాఫియాపై కేంద్రం ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. ఈ వ్యవహారం శ్రీ సత్యసాయి జిల్లాలో రియల్ ఎస్టేట్, కాంట్రాక్టు రంగాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.

## పంట విరామానికి రెడీ అవుతున్న ఆక్వా రంగం


భీమవరం, జూన్ 1,ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెట్టే కీలకమైన ఆక్వా రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. సిండికేట్‌ల దెబ్బకు కుదేలవుతున్న ఆక్వా రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా పంట విరామం ప్రకటిస్తామని ఆక్వా రైతుల రాష్ట్ర సమన్వయ కమిటీ అల్టిమేటం జారీ చేసింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశంలో రైతులు తమ ఆవేదనను, డిమాండ్లను వెల్లడించారు. డాలర్ల పంటగా పేరుగాంచిన ఆక్వా పరిశ్రమను సిండికేట్ వ్యవస్థలు పట్టి పీడిస్తున్నాయి. అమలాపురంలో జరిగిన ఆక్వా రైతు సంఘాల సమావేశంలో రైతులు ముక్తకంఠంతో తమ నిరసనను వ్యక్తం చేశారు.



ఎగుమతిదారులు , మేత తయారీదారులు, హేచరీల యజమానులు ఒక సిండికేట్‌గా ఏర్పడి ధరలను శాసిస్తున్నారని, దీనివల్ల సామాన్య రైతు నిలువునా మునిగిపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించకపోతే, ఆక్వా సాగును నిలిపివేయడం మినహా తమకు మరో మార్గం లేదని స్పష్టం చేశారు.ఆక్వా సాగులో విత్తనం దశ నుంచే మోసం మొదలవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని హేచరీలు నాణ్యత లేని సీడ్‌ను పంపిణీ చేయడం వల్ల పంట ఆరంభంలోనే దెబ్బతింటోందని వారు పేర్కొన్నారు. దీనికి తోడు, మేత ధరలు అమాంతం పెంచి రైతుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల మేత ధరల పెరుగుదలపై రైతులు నిరసన తెలపడంతో, దానికి ప్రతీకారంగా ఎగుమతిదారులు రొయ్యల కొనుగోలు ధరలను కిలోకు రూ. 50 వరకు తగ్గించేశారని, దీనివల్ల టన్నుకు రూ. 50 వేల చొప్పున రైతులు భారీగా నష్టపోతున్నారని గణాంకాలతో వివరించారు.విద్యుత్ సబ్సిడీ విషయంలో కూడా ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని రైతులు ధ్వజమెత్తారు. ఆక్వా జోన్, నాన్-ఆక్వా జోన్ అనే తేడాలు లేకుండా సాగు చేసే ప్రతి రైతుకు సబ్సిడీ విద్యుత్తును అందించాలని వారు డిమాండ్ చేశారు. గతంలో నిలిపివేసిన నాన్-ఆక్వా జోన్ పరిధిలోని 12 వేల విద్యుత్ కనెక్షన్లకు సబ్సిడీని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పరిమితులు ఆక్వా సాగును మరింత భారంగా మారుస్తున్నాయని, ఇది అంతర్జాతీయ మార్కెట్‌లో మన రొయ్యల పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ఆక్వా రైతు సమన్వయ కమిటీ ని ఈ సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా గొట్టిముక్కల గాంధీ భగవాన్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన ఆక్వా ప్రతినిధులు ఈ కమిటీ ద్వారా ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించనున్నారు. ఇచ్చిన గడువులోగా సమస్యలు పరిష్కారం కాకపోతే, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆక్వా సాగును నిలిపివేసి నిరసన తెలుపుతామని వారు తేల్చిచెప్పారు. భీమవరం, కోనసీమ, కైకలూరు, ప్రకాశం, ఏలూరు వంటి ప్రధాన ఆక్వా సాగు జిల్లాల నుంచి భారీగా రైతు నాయకులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంపై తాము ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదని వారు విమర్శించారు. ఎగుమతిదారుల ఆగడాలను కట్టడి చేయకపోతే, రాబోయే రోజుల్లో ఏపీ ఆక్వా రంగం కుప్పకూలడం ఖాయమని హెచ్చరిస్తున్నారు.

## స్థానిక ఎన్నికలు..ఖర్చు భరించేదెలా...

విజయవాడ జూన్ 1, స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన తాజా సూచనలు పార్టీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. రానున్న ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని ఆయన స్పష్టంగా ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పోటీ ఉండేలా చూడాలని, అభ్యర్థుల కొరత అనే కారణం వినిపించకూడదని ఆయన సూచించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైతే బీసీ, ఎస్సీ వంటి వర్గాల నుంచి కొత్త కార్యకర్తలను ప్రోత్సహించి ఎన్నికల బరిలోకి దింపాలని కూడా ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. దీని ద్వారా స్థానిక స్థాయిలో పార్టీ బలం ఏ మేరకు ఉందో పరీక్షించుకోవాలన్న ఉద్దేశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.ఇక రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న వైఎస్ఆర్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన పోరాటం కొనసాగిస్తున్నప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో చాలా మంది కార్యకర్తలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, సర్పంచ్ వంటి పదవులకు పోటీ చేయాలంటే



భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక సర్పంచ్ స్థానం కోసం కనీసం 20 లక్షల నుంచి 30 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, గెలిచినా ప్రతిపక్షంలో ఉండటంతో అభివృద్ధి పనులపై ప్రభావం ఉండదన్న భావన కూడా ఉందని చెబుతున్నారు.ఇదే సమయంలో ఆర్థిక పరిస్థితులు కూడా కేడర్‌ను వెనక్కి లాగుతున్నాయని సమాచారం. చాలా మంది చిన్నస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇంత భారీ ఖర్చును భరించలేమని భావిస్తున్నారని పార్టీ అంతర్గత చర్చల్లో వెలుగులోకి వస్తోంది. అయితే పార్టీ అధినాయకత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి స్థానంలో పోటీ చేయాల్సిందే అని గట్టిగా సూచిస్తుండటంతో ఇంచార్జిలు సర్దుబాటు మార్గాలను వెతుకుతున్నారని అంటున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న నాయకులు కొంత ఆర్థిక సహాయం అందిస్తారా అనే ఆశతో కొందరు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.రానున్న రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేస్తోంది. అధికార కూటమి ప్రభుత్వం కూడా ఈ ఎన్నికలను తమ పరిపాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని చూపించే అవకాశంగా చూస్తోంది. అదే సమయంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి, ఎన్నికల్లో ఆధిక్యం సాధించేందుకు వ్యూహాలు రూపొందిస్తోంది. ఈ పరిస్థితుల్లో వైసీపీ కూడా పోటీకి పూర్తిగా సిద్ధమవుతూ ప్రతి గ్రామంలో పోరాటం కొనసాగించాలని భావిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ఆర్థిక ఒత్తిళ్లు, అభ్యర్థుల ఎంపిక సమస్యలు పార్టీ వ్యూహానికి సవాల్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బాలరాజుకు పవన్ మాస్ వార్నింగ్

ఏలూరు, జూన్ 1,పోలవరం రాజకీయాల్లో ఒక్కసారిగా ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో.. ఈ మధ్య జనసేనాని పవన్ వన్ టు వన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మామూలుగా రివ్యూలు అంటే నియోజకవర్గాల అభివృద్ధిపై జరుగుతాయ్. ఐతే వివాదాలపై ఎమ్మెల్యేకు క్లాస్ తీసుకున్న పవన్.. వాటిని సెట్‌రైట్ చేసుకునేందుకు నాలుగు వారాల డెడ్‌లైన్ ఇచ్చారు. ఇదే ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. నాలుగు వారాల్లో బాలరాజు అంతా క్లియర్ చేసుకుంటారా.. ఒకవేళ చేసుకోకపోతే పరిస్థితి ఏంటి.. అసలు ఆయనకు ఎందుకు పవన్ డెడ్‌లైన్ విధించారు.. ఆయన చుట్టూ ఉన్న వివాదాలు ఏంటి అని ఏపీ రాజకీయాల్లో డిస్కషన్ కనిపిస్తోంది.పంచాయితీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం 147 కోట్ల నిధులు కేటాయించగా.. క్షేత్రస్థాయిలో పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలుస్తోంది. దీనిపై పవన్ నిలదీసినట్లు తెలుస్తోంది. నిధుల కేటాయింపు, టెండర్ల వెనక తప్పులు జరిగాయని విపక్షాలతో పాటు సొంత పార్టీలోనే ఆరోపణలు వినిపించడం పవన్‌కు కోపం తెప్పించింది. దీంతో నాలుగు వారాల్లో పనులు స్పీడప్ కావాలని.. ఆరోపణలకు చెక్ పెట్టాలని.. నాలుగు వారాల డెడ్‌లైన్ పెట్టి ఎమ్మెల్యేకు పవన్ అల్టిమేటం జారీ చేశారని టాక్.చిర్రి బాలరాజుకు కేవలం ఆర్థిక, రాజకీయ చిక్కులే కాదు.. కుటుంబం నుంచి అంతకు మించిన తలపోటు ఉందనే చర్చ నడుస్తోంది. ఆయనపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలు..జనసేన ప్రతిష్టను మసకబారుస్తున్నాయని.. సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. పవన్ కళ్యాణ్‌తో భేటీలో ఫ్యామిలీ మేటర్ చుట్టూ కూడా గట్టిగానే చర్చకు జరిగిందని తెలుస్తోంది. వ్యక్తిగత వ్యవహారాలు, కుటుంబ వివాదాలతో.. పార్టీ ఇమేజ్ దెబ్బతినకూడదని.. ఆ గొడవలను 4 వారాల్లోగా పూర్తిగా చక్కదిద్దుకోవాలని పవన్ వార్నింగ్ ఇచ్చారట.ఇక అటు ఎమ్మెల్యే బాలరాజును టార్గెట్ చేస్తూ అధిష్టానానికి రోజుకో ఫిర్యాదు వెళ్తోందని తెలుస్తోంది. గత ఎన్నికల్లో తన గెలుపులో కీలక పాత్ర పోషించిన సీనియర్లు, ద్వితీయ శ్రేణి నాయకులను.. బాలరాజు పక్కన పెట్టేశారట. దీంతో అసంతృప్తితో రగిలిపోతున్న నేతలు.. ఎమ్మెల్యే వైఫల్యాలను, ఆరోపణలను ఎప్పటికప్పుడు సాక్ష్యాలతో సహా పార్టీ హెడ్ ఆఫీస్‌కు చేరవేస్తున్నారట. దీంతో పవన్ ఘాటుగా రియాక్ట్ అయ్యారని తెలుస్తోంది. వైఫల్యాలు, వ్యక్తిగత వ్యవహారాలే కాదు..కేడర్‌ను కూడా కలుపుకుపోవాలని వార్నింగ్ ఇస్తూ.. పవన్ నాలుగు వారాల డెడ్‌లైన్ విధించారట.త్వరలో ఏపీలో స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయ్. పోలవరం నియోజకవర్గం ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయాలని కూటమి పార్టీలు టార్గెట్ పెట్టుకున్నాయ్. దీంతో పార్టీకి తన మార్క్ రిపేర్లు చేస్తున్నారు పవన్. కేడర్‌ను కూల్ చేయడంతో పాటు.. క్షేత్రస్థాయిలో ఏ చిన్న పొరపాటు కూడా కనిపించకూడదు అనుకునేలా.. బాలరాజుకు పవన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు వాదనలు వినిపిస్తున్నాయ్. సేనాని ఇచ్చిన 4వారాల డెడ్‌లైన్‌లోగా.. ఫ్యామిలీ సమస్యలను సెటిల్ చేసుకుని, అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పరుగులు పెట్టించి.. కేడర్‌ను యాక్టివేట్ చేయాల్సిన బాధ్యత బాలరాజుదే! ఇదే ఇప్పుడు ఆయనకు అతిపెద్ద సవాల్‌గా మారే చాన్స్ ఉంది. మరి బాలరాజు ఏం చేస్తారు..ఎలాంటి అడుగులు వేస్తారు.. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు.. 4 వారాల్లో అంతా సెట్‌రైట్ చేసుకొని తనను తాను ప్రూవ్ చేసుకుంటారా అనే చర్చ.. పోలవరంలో హాట్‌టాపిక్‌గా మారింది.

## కడప జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న నైట్ పెట్రోలింగ్

కడప,జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. నియంత్రణే లక్ష్యంగా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపోదించడం కోసం ప్రతీ రోజు నైట్ పెట్రోలింగ్ విధులు కొనసాగుతున్నాయి. లాక్డ్ హౌస్ ( తాళాలు వేసిన ఇళ్లు ) వద్ద దొంగతనాలు జరగకుండా ప్రత్యేకంగా నిఘా ఉంచారు. కింది స్థాయి సిబ్బంది నుండీ ఎస్సైలు, సి.ఐ లు, డీఎస్పీల దాకా రాత్రి వేళ మరింత అప్రమత్తత తో గస్తీ విధులు, పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. బీట్ తనిఖీ అధికారులు, సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రవాణా వివరాలు, కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అక్రమ రవాణాను అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. బీట్ తనిఖీ అధికారులు తరచూ బీట్ పాయింట్స్ తనిఖీ చేసి, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎటువంటి నేరాలు జరగకుండా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించేలా చేస్తున్నారు. లాడ్జి రూమ్స్ లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ?? లాడ్జిలో ఉంటున్న వారి అధార్ కార్డు పరిశీలించి వివరాలు సేకరించారు. లాడ్జిలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ?? నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేసి అనుమానాస్పద/కొత్త వ్యక్తుల యొక్క వివరాలు ఆరా తీశారు. పాత నేరస్తులు, అనుమానితులు, చెడునడత కలిగిన వారి పై నిఘాను పెడుతున్నారు.

# ఈ వేసవిలో కివీ పండు చేసే ఆరోగ్య అద్భుతాలు తెలిస్తే మీరు వదిలిపెట్టరు



ఆరోగ్యంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అయితే ఆరోగ్యంగా ఉండాలి అనుకునే వారు ఏం తినాలి? ఏం తినకూడదు? అనే విషయాన్ని కచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యంగా ఉండాలి అనుకునే వారు ముఖ్యంగా పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవాలి. అందులోనూ సీజనల్ ఫ్రూట్స్ ను తినడం పొరపాటున కూడా మరిచిపోవద్దు. కివి పండ్లలో ఫుల్ పోషకాలు ప్రస్తుతం వేసవి కాలంలో ఉన్నాం. ఈ సీజన్లో దొరికే పండ్లను తింటే ఎంతో మంచిది. ఇక ఈ సీజన్లో మనం కివి పండును ఎక్కువగా తింటే మంచిదని చెప్పవచ్చు. కివి పండులో విటమిన్లు, విటమిన్ సి, విటమిన్ ఈ, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాలతో మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తుంది. ఈ కివి పండును వేసవిలో తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. కివి పండ్లతో చర్మ ఆరోగ్యం కివి పండ్లను ప్రతిరోజు తినడం వల్ల చర్మ సమస్యలు దూరమవుతాయి. ముఖ్యంగా వేసవికాలంలో కివి పండు చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. కివి పండ్లు విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయి. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణ ప్రక్రియకు ఎంతగానో దోహదం చేస్తాయి. కివి పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. కివి పండుతో గుండె ఆరోగ్యం కివి పండ్లు కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. కివి పండులో ఉండే పోషకాలు విటమిన్ సి, పాలిఫెనాల్స్, పొటాషియం వంటివి గుండె ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి. కివి పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటిలో ఉండే విటమిన్ సి కారణంగా మన కంటి చూపు మెరుగు పడుతుంది. 5 కివి పండ్లతో శరీరంలో మంచి బ్యాక్టీరియా చైనా, తైవాన్ ప్రధాన భూభాగానికి చెందినది అయిన కివి పండు న్యూజిలాండ్, కాలిఫోర్నియా వంటి దేశాలలో వాణిజ్యపరంగా బాగా పండిస్తారు. ప్రస్తుతం మనదేశంలో కూడా ఇది అన్ని ప్రాంతాలలోనూ అందుబాటులో ఉంది. కివి పండును చైనీస్ గూస్ బెర్రీ అని పిలుస్తారు. కివి పండ్లను తింటే మన శరీరంలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. బీపీని, డయాబెటిస్ ను కంట్రోల్ చేసే కివీ పండు గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యల నుంచి కివీ ఉపశమనం కలిగిస్తుంది. బీపీని, డయాబెటిస్ ను కంట్రోల్ చేస్తుంది. ఆస్తమా లక్షణాలను తగ్గిస్తుంది. క్యాన్సర్ నివారణకు ఎంతగానో దోహదం చేస్తుంది. మన బరువు తగ్గడానికి కూడా కివి పండు అద్భుతంగా పనిచేస్తుంది.

# నాటు సారా తాగడం ఏం జరుగుతుందో తెలుసా..?

"నాటు సారా" అంటే దేశీయంగా తయారుచేసే ఒక రకమైన మద్యము. దీనిని బెల్లం లేదా ఇతర పులియబెట్టిన పదార్థాల నుండి తయారుచేస్తారు. ఇది చట్టవిరుద్ధంగా తయారుచేయబడుతుంది. ఇది తరచుగా ప్రమాదకరమైన పదార్థాలను కలిగి ఉంటుంది, ఇది వినియోగదారులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది.దీని తయారీ, అమ్మకం,వినియోగం అనేక ప్రాంతాలలో నిషేధించబడింది. తయారీ విధానం: నాటు సారాను సాధారణంగా పులియబెట్టిన బెల్లం, ఇతర పదార్థాలతో తయారు చేస్తారు. ఈ ప్రక్రియలో సరైన పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రమాదకరమైన రసాయనాలు, బ్యాక్టీరియా ఏర్పడే అవకాశం ఉంది.ప్రమాదాలు: నాటు సారాలో మిథనాల్ వంటి విషపూరిత పదార్థాలు ఉండవచ్చు. దీని వల్ల కళ్ళు పోవడం, కాలేయం దెబ్బతినడం, గుండె సంబంధిత సమస్యలు, చివరికి మరణం కూడా సంభవించవచ్చు. చట్టపరమైన సమస్యలు: నాటు సారా తయారు చేయడం, విక్రయించడం, తాగడం చట్టవిరుద్ధం. దీనిని తయారుచేసేవారు, విక్రయించేవారు, తాగేవారు చట్టపరమైన చర్యలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఆరోగ్య సమస్యలు: నాటు సారా తాగడం వల్ల తక్షణ ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. ఇది కాలేయానికి, మూత్రపిండాలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. నాటు సారాకు బదులుగా చట్టబద్ధంగా విక్రయించే మద్యం తాగడం సురక్షితం.కాలేయ వ్యాధులు: నాటు సారాలో ఉండే అధిక ఆల్కహాల్ శాతం కాలేయాన్ని దెబ్బతీస్తుంది. దీని వల్ల కాలేయ సిర్రోసిస్, కాలేయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. 5 5 గుండె సంబంధిత సమస్యలు: నాటు సారా తాగడం వల్ల రక్తపోటు పెరిగి గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. కడుపు సంబంధిత సమస్యలు: నాటు సారా కడుపులో మంటను కలిగిస్తుంది. దీని వల్ల అల్సర్, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి. నాటు సారా తాగడం వల్ల మెదడు పనితీరు మందగిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కంటి చూపు మందగించడం: నాటు సారాలో మిథనాల్ అనే విషపూరితమైన రసాయనం ఉండటం వల్ల కంటి చూపు మందగించే ప్రమాదం ఉంది. ఒక్కోసారి పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. కిడ్నీ సమస్యలు: నాటు సారా కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. దీని వల్ల కిడ్నీ ఫెయిల్యూర్ వచ్చే ప్రమాదం ఉంది. న్యూరోలాజికల్ సమస్యలు: నాటు సారా తాగడం వల్ల నరాల బలహీనత, పక్షవాతం వంటి న్యూరోలాజికల్ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మరణం: నాటు సారాలో మిథనాల్ అనే విషపూరితమైన రసాయనం ఉండటం వల్ల ఒక్కోసారి మరణం కూడా సంభవించవచ్చు.నాటు సారా తాగడం వల్ల కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజం కూడా ప్రమాదంలో పడుతుంది. కాబట్టి, నాటు సారా తాగడం మానుకోవడం చాలా ముఖ్యం.



# చిరుధాన్యాలు కాదు ఆరోగ్యాన్నిచ్చే సిరిధాన్యాలు.. వదిలిపెట్టకండి


మన ఆరోగ్యం ఎవరి చేతులలోనూ ఉండదు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. ముఖ్యంగా మనం తినే ఆహారంలోనే ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంత సంపద ఉన్న ఆరోగ్యంగా లేకుంటే ఏం చేసినా, ఎంత సంపాదించినా వేస్ట్. ఆరోగ్యం లేకుంటే జీవితమే వృధా అవుతుంది. చిరు ధాన్యాలపై ప్రజలలో పెరిగిన అవగాహన మరి మనకు ఆహారం అనగానే పండ్లు ,కూరగాయలు,ఆకు కూరలే గుర్తొస్తాయి. కానీ ఈ మధ్య కాలంలో ఎక్కువగా ప్రాచుర్యం పొందుతున్న ఆహారం చిరు ధాన్యాలు. ఇటీవల కాలంలో జనాలకు వీటిపైన చాలా అవగాహన పెరిగింది. చాలా చోట్ల చిరుదాన్యాలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులు లభిస్తున్నాయి. చిరు ధాన్యాల టిఫిన్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఇక చిరు ధాన్యాలతో పిండి వంటలు కూడా తయారు చేస్తున్నారు. చిరు ధాన్యాలలో వేటికవే స్పెషల్ ఇక ఎలాంటి చిరు ధాన్యాలతో మనం ఆరోగ్యంగా ఉంటామో తెలుసుకుందాం. చిరు ధాన్యాలలో కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, అండ్రు కొర్రలు ఇలా చాలానే ఉన్నాయి. ఈ చిరు దాన్యాలన్నీ వేటికవే స్పెషల్. చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని భావించే వారు వీటిని ఒక టైం టేబుల్ ప్రకారం ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. చిరుధాన్యాలతో ఆరోగ్యం చిరు ధాన్యాలలో మన శరీరానికి కావలసిన బోలెడు మిటమిన్లు, పోషకాలు ఉంటాయి. చిరు ధాన్యాలు ముఖ్యంగా మన శరీరానికి కావాల్సిన పోషకాలను ఇవ్వటంతో పాటు మన శరీర బరువును తగ్గించటానికి చాలా బాగా ఉపయోగపడతాయి. అలాంటి ఆరోగ్యానిచ్చే వాటిలో రాగులు ఒకటి . ఇవి ఎముకలను బలంగా మారుస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, అనీమియాను నివారిస్తాయి. రాగులు ఆహారంలో



చేర్చుకుంటే ఆరోగ్యం రాగులను నానబెట్టి మొలకలు వచ్చాకా తినవచ్చు ఇలా తినడం వలన శరీరానికి మెరుగైన పోషకాలు అందుతాయి. ఆహారంలో రాగులను వివిధ రూపాల్లో చేర్చుకోవచ్చు . రాగులను పిండిగా చేసుకుని రాగి జావ చేసుకోవచ్చు రాగిజావ మంచి పౌష్టికాహారం. రాగి పిండితో దోశ,ఇడ్లీలు కూడా చేసుకోవచ్చు. రాగి సంకటి చేసుకుని తిన్నా మంచిదే. గుండె సమస్యరాకుండా చేసే జొన్నలు ఇక చిరుదాన్యాలలో మరొక ముఖ్యమైన సిరి ధాన్యం జొన్నలు, ఈ చిరు ధాన్యాలు తినడం వలన హార్ట్ ను హెల్దీగా ఉంచుతాయి. మన శరీరంలో గుండె ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఈ మధ్యకాలంలో చాలా మందిని హార్ట్ సమస్య వెంటాడుతుంది. ఇక హార్ట్ సమస్యను అరికట్టడానికి తృణ ధాన్యాలలో మేలైనవి జొన్నలు. శరీరంలో ఇమ్యూనిటీ నీ పెంచుతుంది. శరీరంలో అనేక మంచి మార్పులను తెస్తుంది. బరువు తగ్గించటంలో జొన్నల పాత్ర జొన్నలు అధిక బరువును నియంత్రిస్తాయి. బరువు తగ్గించటంలో జొన్నల పాత్ర చాలా కీలకం. చెడు కొలెస్ట్రాల్ ను కరిగిస్తుంది. షుగర్ లెవల్ ను పెరగకుండా అరికడుతుంది. జొన్నలని నానబెట్టి మొలకలుగా తినవచ్చు,లేదా జొన్నలను పిండిగా చేసి జొన్నరొట్టెల రూపంలో ఆహారంగా తినవచ్చు. జొన్న ఇడ్లీ, జొన్న దోశ వంటివి కూడా చేసుకుని తినవచ్చు. ఈ జొన్నలలో మాంసకృతులు అధికంగా ఉంటాయి. రక్తం పెరగటానికి తోడ్పడే ఇనుము ,క్యాల్షియం బి మిటమిన్లు ఉంటాయి. ఆరోగ్యానికి మేలు చేసే చిరు ధాన్యాలలో సజ్జలు స్పెషల్ ఫైబర్, మెగ్నీషియం పొటాషియం, జింక్ వంటి పోషకాలు సజ్జలలో పుష్కలంగా ఉంటాయి. అన్ని చిరు ధాన్యాలలో కెల్ల అధిక పోషకాలు సజ్జలలో ఉంటాయి..వీటిని ఆహారంలో చేర్చుకోవడం వలన జీర్ణశక్తి మెరుగుపడుతుంది. సజ్జలను ఆహారంలో చేర్చుకుంటే మల బద్ధకం సమస్య ఉన్నవారికి ఉపశమనం కలుగుతుంది. అలాగే గుండె సంబంధిత వ్యాధులను అరికడుతుంది గుండె జబ్బుల ప్రమాదం రాకుండా సజ్జలు కాపాడుతాయి. డయాబెటిస్ ఉన్న వారికి సజ్జలు సూపర్ ఫుడ్ రక్త ప్రసరణలో గ్లూకోజ్ ను నిదానంగా విడుదల అయ్యేలా చేస్తాయి సజ్జలు. రక్తపు చక్కర స్థాయిలను ఆకస్మికంగా పెరగకుండా సజ్జలు అరికడతాయి. ఇవి మధుమేహం వున్న వారికి లేదా మధుమేహం బారిన పడే అవకాశాలు ఉన్న వ్యక్తులకు మంచి ఆహారం. సజ్జలు మధుమేహం బారిన పడకుండా కాపాడతాయి. సజ్జలను అన్నంగా, సజ్జల జావగా, ఇడ్లీ, దోశ వంటివి చేసుకుని కూడా తీసుకోవచ్చు. ముఖ్యమైన సిరి ధాన్యం కొర్రలు ఇక చిరుధాన్యాలలో మరో ముఖ్యమైన ఆహారంగా కొర్రలు చెప్పవచ్చు. కొర్రలలో ప్రోటీన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు మరియు ఖనిజాలు సమపాళ్ళలో ఉండి ఆహారంలో భాగంగా తీసుకున్న వారికి మేలు చేస్తాయి. కొర్రలతో తినేవారికి బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మధుమేహం,ఊబకాయం లాంటివి అస్సలు దరిచేరవు. ఊబకాయం, డయాబెటిస్ కు కొర్రలతో చెక్ బరువుని తగ్గించడంలో సహాయపడుతుంది. కోలన్ క్యాన్సర్ తో పాటు చాలా రకాల క్యాన్సర్ లను రాకుండా అరికడుతుంది .రక్తంలో చక్కెర స్థాయిలను అరికడుతుంది .ఈ కొర్రలను ఏ వయస్సు వారు అయినా తినవచ్చు. కొర్రలు రక్త హీనతను తగ్గిస్తాయి. జీర్ణ సమస్యలను తగ్గించటానికి దోహదం చేస్తాయి. అండ్రు కొర్రలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు మనం చెప్పుకోవలసిన మరొక ముఖ్యమైన సిరి ధాన్యం అండ్రు కొర్రలు. ఈ అండ్రు కొర్రలను బ్రౌన్ టాప్ మిల్లెట్ అని చెబుతారు. అండ్రు కొర్రలను ఆహారంలో భాగంగా చేసుకుంటే కఫ సంబంధమైన సమస్యలు తగ్గుతాయి. ఇది జీర్ణవ్యవస్థకు ఎంతగానో దోహదం చేస్తుంది. పైల్స్, ఫిస్టులా, హెమరాయిడ్స్, అల్సర్స్ తో పాటు కొన్ని రకాల క్యాన్సర్లను తగ్గించడానికి ఉపయోగపడుతుంది.కీళ్ళ నొప్పులకు చెక్ పెట్టే అండ్రు కొర్రలు అండ్రు కొర్రలు కీళ్లనొప్పులను తగ్గిస్తాయి. మతిమరుపు రాకుండా సహాయం చేస్తాయి. ఎముకలకు బలాన్ని ఇస్తాయి. మధుమేహ వ్యాధిని నియంత్రించడంలో ఇవి కీలకంగా పనిచేస్తాయి.రక్త హీనతను తగ్గించటంలో కీలక భూమిక పోషిస్తాయి. అలాగే జ్వరం, జలుబు వంటి ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి.

# మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా? అయితే ఈ జాగ్రత్తలు తీసుకోండి

మైగ్రేన్ ఇది ఒక విపరీతమైన తలనొప్పి. మైగ్రేన్ తో బాధ పడేవారు మరే ఇతర పనులపైనా ఫోకస్ పెట్టి పని చెయ్యలేరు. అసలు మైగ్రేన్ తలనొప్పి ఎందుకు వస్తుంది? మైగ్రేన్ తలనొప్పి సాధారణంగా ఒకవైపున గుచ్చుకున్నట్టు, కొట్టుకున్నట్టు ఒక రకమైన బాధను కలిగిస్తూ వచ్చే తలనొప్పి. ఏదైనా కాంతిని చూసినా, శబ్దాన్ని విన్నా భరించలేని సున్నితత్వం తో కూడిన తలనొప్పి. వికారం, వాంతులు వంటి లక్షణాలతో కూడినటువంటి తలనొప్పి. మైగ్రేన్ తలనొప్పికి కారణాలు ఎన్నో మైగ్రేన్ తలనొప్పి తో బాధపడే వారికి కళ్ళ చుట్టూ నొప్పి, దృష్టిలో మార్పులు కూడా చోటు చేసుకుంటాయి. ఒత్తిడి వల్ల, నిద్రలేమి సమస్యల వల్ల, హార్మోన్లలో జరిగే మార్పుల వల్ల, జన్యుపరమైన అంశాల వల్ల కూడా మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంది. మైగ్రేన్ రావడానికి ఇది అని పర్టిక్యులర్ గా కారణాన్ని చెప్పలేము. మైగ్రేన్ దీర్ఘకాలంగా ఉంటే, అది మానసిక ఒత్తిడిని పెంచి పనిసామర్థ్యాన్ని తగ్గిస్తుంది. మైగ్రేన్ నియంత్రించకపోతే నరాల సమస్యగా మారే అవకాశం



దీర్ఘకాలిక మైగ్రేన్ గల వ్యక్తులు తరచుగా మానసిక, శారీరక అనారోగ్యానికి గురవుతారు. మైగ్రేన్ నియంత్రించకపోతే, అది నరాల సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది. ఈ తలనొప్పికి తగినంత నీరు తాగకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం, మితిమీరిన కాఫీ లేదా ఆల్కహాల్ తీసుకోవడం వంటి అనేక కారణాలు కూడా ఉంటాయి. స్మోకింగ్, బహుళ రకాల రసాయనాలతో తయారైన ప్రాసెస్డ్ ఫుడ్ కూడా మైగ్రేన్ తలనొప్పికి కారణం అవుతుంది. ఆహారపు జాగ్రత్తలు మైగ్రేన్ ఉన్నవారు గ్లూటెన్, ప్రాసెస్డ్ ఫుడ్, ఆల్కహాల్, కాఫీ, చాక్లెట్, ఎక్కువ ఉప్పు, కారంగా ఉండే ఆహారం ఎక్కువ తినకూడదు. బదులుగా ఆకుకూరలు, పండ్లు,కూరగాయలు తీసుకోవాలి తగినంత నీరు, పొటాషియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం మంచిది. తరచుగా ఆహారాన్ని మానేయకుండా ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యానం లంచ్ ,అలాగే రాత్రికి పళ్ళు తింటే మైగ్రేన్‌ను తగ్గించే అవకాశం ఉంది అయితే వెంటనే వీటిని తినండి! మైగ్రేన్ నివారణ మార్గాలు నియంత్రిత జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారం, సమయానికి నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించడం వంటి మార్పులు మైగ్రేన్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. ప్రతిరోజూ యోగాసనాలు, ధ్యానం చేయడం వల్ల మైగ్రేన్ తీవ్రత తగ్గే అవకాశం ఉంది. ఎక్కువ నీరు తాగడం,తొందరగా జీర్ణం అయ్యే తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిది , రాత్రి సమయంలో ఆలస్యం చేయకుండా తొందరగా భోజనం చేసే తగినంత విశ్రాంతి తీసుకోవడం కూడా మైగ్రేన్ ను తగ్గించడానికి దోహదం చేస్తుంది.


# స్పోర్ట్స్ న్యూస్

## ఐపీఎల్ 2026: వైభవ్ సూర్యవంశీ ఆదాయం ఎంతో తెలుసా?

ఐపీఎల్ 2026లో బ్యాట్‌తో విధ్వంసం సృష్టించిన 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ.. అరుదైన రికార్డులు కొల్లగొట్టి పలు అవార్డులు అందుకున్నాడు. ఈ సీజన్‌లో 776 పరుగులు చేసి.. ఆరెంజ్ క్యాప్‌ను కైవసం చేసుకున్నాడు. 59 సిక్సర్ల క్రిస్ గేల్ రికార్డును బద్దలు కొట్టడమే కాకుండా ఏకంగా ఒకే సీజన్‌లో 72 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. మరి ఈ కుర్రాడు ఐపీఎల్ 2026లో ఎంత డబ్బును సంపాదించాడో తెలుసా..వైభవ్ సూర్యవంశీని ఐపీఎల్ 2025 వేలంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ రూ.1.10కోట్లకు కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లోనూ అదే మొత్తానికి రిటైన్ చేసుకుంది. ఈ డబ్బుతో పాటు వైభవ్ మ్యాచ్ ఫీజులు, పలు రివార్డులూ అందుకున్నాడు. మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా రూ.15 లక్షలు, టోర్నమెంట్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్ అందుకున్నందుకు రూ.10 లక్షలు, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచినందుకు రూ.10లక్షలతో పాటు టాటా సియెరా కారు, సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచినందుకు రూ.10 లక్షలు, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నందుకు రూ.10 లక్షలు అందుకున్నాడు.కేవలం ఈ అవార్డుల ద్వారానే వైభవ్ రూ.55లక్షల నగదు బహుమతిగా అందుకున్నాడు. ఇక బీసీసీఐ అమలు చేసే మ్యాచ్ ఫీజు విధానం ప్రకారం, ప్రతి మ్యాచ్‌కు రూ.7.5 లక్షల చొప్పున ఆటగాళ్లకు చెల్లిస్తారు. వైభవ్ ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌లు ఆడటంతో మ్యాచ్ ఫీజుల రూపంలోనే రూ.1.20 కోట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. దీనికి తోడు పలుమార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ఎలక్ట్రిక్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్', 'మోస్ట్ సిక్సెస్ ఆఫ్ ది మ్యాచ్' వంటి అవార్డులను కూడా గెలుచుకున్నాడు. ఒక్కో అవార్డుకు రూ.1 లక్ష చొప్పున నగదు బహుమతి లభించింది. అన్నీ కలిపి చూస్తే, రిటైనర్ ఫీజు రూ.1.10 కోట్లు, మ్యాచ్ ఫీజులు రూ.1.20 కోట్లు, సీజన్ అవార్డుల ద్వారా రూ.55 లక్షలు, ఇతర మ్యాచ్ అవార్డుల నగదు బహుమతులతో కలిసి వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026లో రూ.2.85 కోట్లకు పైగా ఆదాయం పొందినట్లు తెలుస్తోంది. కేవలం 15 ఏళ్ల వయసులోనే విధ్వంసం సృష్టిస్తున్న వైభవ్.. ఇప్పుడు ఐపీఎల్‌లో అత్యంత విలువైన యువ క్రికెటర్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు.




## ఆర్సీబీ విజయం.. బెంగళూరులో అభిమానుల వీరంగం



స్పోర్ట్స్ డెస్క్: పోరులో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. ఛేజింగ్ మాస్టర్ విరాట్ కోహ్లీ 75 పరుగులతో ఆర్సీబీని విజయతీరాలకు చేర్చాడు. ఆర్సీబీ ఘన విజయాన్ని సాధించడంతో దేశవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ఆర్సీబీ హోమ్ గ్రౌండ్ అయిన బెంగళూరు నగరం అర్ధరాత్రి వేళ బాణసంచా వెలుగులు, టపాసుల శబ్దాలతో దద్దరిల్లిపోయింది. కానీ, పలుచోట్ల అభిమానులు రచ్చ చేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.గతేడాది ఆర్సీబీ టైటిల్ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన ఘోరమైన తొక్కిసలాటలో 11 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ విషాద ఘటనను దృష్టిలో ఉంచుకుని, ఆదివారం రాత్రి బెంగళూరు నగరంలో అభిమానులు గుమిగూడిన ప్రధాన ప్రాంతాలలో పోలీసులు గస్తీ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. చుట్టూ పోలీసు బారికేడ్లు ఉన్నప్పటికీ విరాట్ కోహ్లీని, ఆర్సీబీ జట్టును కీర్తిస్తూ అభిమానులు వీధుల్లో సంబరాలు చేసుకున్నారు. కొందరు మాత్రం శ్రుతిమించి ప్రవర్తించారు. చొక్కాలు విప్పి.. రోడ్లపై రచ్చ రచ్చ చేశారు.పోలీసులు ఎంత చెప్పినా వినకపోవడంతో కొందరికి తమదైన శైలిలో పోలీసులు సమాధానం ఇచ్చారు. మరికొందరైతే రోడ్లపై వాహనాలకు ఎదురు నిలబడి డ్యాన్సులు చేశారు. ఇలా తోటివారిని ఇబ్బంది పెడతూ సంబరాలు చేసుకున్న వారిపై బెంగళూరు పోలీసులు కాస్త కఠినంగా వ్యవహరించారు. కొందరు యువకులు అత్యుత్సాహంతో బైకులతో రోడ్లపై ప్రమాదకర ఫీట్స్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు యువకులను చెదరగొట్టారు. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కూడా కొందరు ఆర్సీబీ అభిమానులు వీరంగం సృష్టించారు.

## 150–180 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది: గిల్

ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో ఆర్సీబీపై గుజరాత్ టైటాన్స్ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఐదేళ్లలో రెండోసారి ఫైనల్ చేరిన జీటీ.. ఆఖరి మెట్టుపై బోల్తా పడింది. రెండోసారి కప్పును ముద్దాడాలనే కలను సాకారం చేసుకోలేకపోయింది. బ్యాటర్లు, బౌలర్లు విఫలమైన వేళ.. జీటీ 155 పరుగులకే పరిమితమైంది. ఛేదనలో ఆర్సీబీ 18 ఓవర్లలో ఆటను ముగించింది. ఈ నేపథ్యంలో గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఓటమిపై స్పందించాడు.'మేము 150–180 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. పిచ్ చాలా నెమ్మదిగా ఉందని నేను భావించడం లేదు. తొలి నాలుగు ఓవర్లలో పేసర్లకు కొంత సహకారం లభించింది. ఆ సమయంలోనే మేం కీలక వికెట్లు కోల్పోయాం. మధ్య ఓవర్లలో కూడా వేగం పెంచలేకపోయాం. దీంతో ఆశించిన స్కోర్ చేయలేకపోయాం. ఇది ఫైనల్ మ్యాచ్. తక్కువ స్కోర్ చేసినా.. వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెడితే గెలుపు అవకాశాలు ఉంటాయని భావించాం. కానీ అనుకున్న ప్రణాళికలు పక్కాగా అమలు చేయడంలో విఫలమయ్యాం. అదే మా ఓటమికి కారణమైంది' అని గిల్ వెల్లడించాడు.'ఈ సీజన్‌లో మేం అద్భుత ప్రదర్శనలు కనబరిచాం. ఎప్పుడూ ఒకరితో ఒకరం మాట్లాడుకుంటూ.. మా ఆటలో లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం చేశాం. ప్రతి అంశంలో మెరుగుదల కోసం కష్టపడ్డాం. ఈసారి ట్రోఫీని అందుకోలేకపోయాం. కానీ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో మేం మెరుగుపరుచుకోవాల్సిన విషయాలు ఉన్నాయి. ఒకవేళ కప్ గెలిచినా కూడా సరిచేసుకోవాల్సిన అంశాల గురించి మేము చర్చించుకునేవాళ్లం' అని గిల్ తెలిపాడు. ఫైనల్ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్.. 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. ఛేదనలో ఆర్సీబీ 18 ఓవర్లకే ఆటను ముగించింది. వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది.




## రవిశాస్త్రి ప్రశ్నకు వైభవ్ సూర్యవంశీ క్రేజీ ఆన్సర్!



ఐపీఎల్ 2026 సీజన్‌లో తన అద్భుత బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించిన రాజస్థాన్ రాయల్స్ యువ హిట్టర్ వైభవ్ సూర్యవంశీ.. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 5 ప్రతిష్ఠాత్మక అవార్డులను కొల్లగొట్టాడు. మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, ఆరెంజ్ క్యాప్, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, మోస్ట్ సిక్సర్స్ అవార్డులను ఈ 15 ఏళ్ల కుర్రాడే దక్కించుకోవడం విశేషం. అందుకే ఆదివారం జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ అనంతరం ప్రజెంటేషన్ వేడుకలో అభిమానుల దృష్టంతా ఈ బుడ్డోడిపైనే ఉంది.వైభవ్ సూర్యవంశీ వరుసగా ఐదు అవార్డులను అందుకోవడానికి స్టేజ్ పైకి వెళ్లినప్పుడు.. అక్కడ కామెంటేటర్‌గా ఉన్న టీమిండియా మాజీ దిగ్గజం రవిశాస్త్రి సైతం అతడికి ఫిదా అయ్యాడు. వైభవ్ కొట్టే సిక్సర్ల వెనుక ఉన్న అసలు రహస్యాన్ని తెలుసుకోవాలనే ఉద్దేశంతో రవిశాస్త్రి ఓ ఫన్నీ ప్రశ్న వేశాడు. 'నువ్వు రోజుకు ఎన్ని పాలు తాగుతావు?' అని రవిశాస్త్రి అడిగాడు. ఈ ఊహించని సరదా ప్రశ్నకు స్టేడియంలో ఉన్నవారంతా నవ్వేశారు.రవిశాస్త్రి అడిగిన ప్రశ్నకు ఈ 15 ఏళ్ల బుడ్డోడు అంతే అమాయకంగా, నవ్వుతూ.. 'ప్రస్తుతం నేను పాలు తాగడం లేదు' అని సమాధానం ఇచ్చాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. వైభవ్ సూర్యవంశీ కేవలం 15 ఏళ్ల 65 రోజుల వయసులోనే ఆరెంజ్ క్యాప్ గెలుచుకుని ఐపీఎల్ చరిత్రలోనే ఓ కొత్త రికార్డును లిఖించాడు. ఐపీఎల్ చరిత్రలో ఆరెంజ్ క్యాప్ అందుకున్న అత్యంత చిన్న వయస్కుడిగా వైభవ్ నిలిచాడు.

## విన్నింగ్ సెలబ్రేషన్స్.. అనుష్క శర్మతో కోహ్లీ క్రేజీ డ్యాన్స్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు వరుసగా రెండోసారి టైటిల్ అందుకుంది. దీంతో ఆర్సీబీ ప్లేయర్లు, సిబ్బంది సంబరాలు అంబరాన్నంటాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో ఆర్సీబీ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ డ్యాన్స్ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అతడి సతీమణి అనుష్క శర్మతో కలిసి కోహ్లీ చేసుకున్న సంబరాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఫైనల్‌లో విజయం అనంతరం ఆర్సీబీ తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఓ వీడియోను పంచుకుంది. అందులో కోహ్లీ, అనుష్క శర్మతో పాటు మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్, ఇతర జట్టు సభ్యులతో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ కనిపించాడు. ఈ వీడియో క్షణాల్లోనే వైరల్‌గా మారింది. కోహ్లీ స్టెప్పులకు అనుష్క కూడా సర్‌ప్రైజ్ అయింది. విరాట్ డ్యాన్స్ చేస్తుంటే వీడియోలు తీస్తూ మురిసిపోయింది.ఆర్సీబీ స్టార్ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్య ఆనందానికి అవధులే లేవు. తన కెరీర్‌లో పలు ఫ్రాంచైజీల తరఫున కృనాల్ ఐదుసార్లు ట్రోఫీని అందున్నాడు. ఆర్సీబీ తరఫున ఇది రెండోది కావడం విశేషం. ఆర్సీబీ విన్నింగ్ షాట్ నుంచి సెలబ్రేషన్స్ పూర్తి చేసుకుని హోటల్‌కి వచ్చే వరకు కృనాల్ ట్రోఫీని వదల్లేదు. హోటల్‌కు వెళ్తూ డప్పుల ముందు జట్టు సభ్యులందరూ స్టెప్పులు వేశారు. వారి సందడి జాతరను తలపించింది. డప్పుల స్పీడుకు తగ్గట్లు జోరుగా డాన్స్ చేశారు. కృనాల్ పాండ్య పిల్లాడిగా మారిపోయి ట్రోఫీని నెత్తిన పెట్టుకొని చిందులు వేశాడు. కోహ్లీ కూడా స్టెప్పులు వేస్తూ ఎంకరేజ్ చేశాడు. రసిఖ్ సలామ్ దార్ ఏకంగా డప్పు మీద ఎక్కేసి మరీ చిందేశాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

## ముంబైపై విజయంతో మా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది: కోహ్లీ



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ ట్రోఫీని వరుసగా రెండోసారి ముద్దాడింది. ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఛేజింగ్ మాస్టర్‌గా పేరు పొందిన విరాట్ కోహ్లీ ఆఖరి దాకా నిలిచి ఆర్సీబీ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం కింగ్ కోహ్లీ కీలక వ్యాఖ్యలు చేశాడు. లీగ్ దశలో కాస్త తడబడినా.. ముంబై ఇండియన్స్‌పై ఉత్కంఠపోరులో విజయం సాధించడం తమ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందని అన్నాడు.ఈ విజయానంతరం అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన విరాట్ కోహ్లీ.. తమ ఆటగాళ్లపై ప్రశంసల జల్లు కురిపించాడు. 'గతేడాది ఉన్నంత ఒత్తిడి ఈసారి లేదని నేను మా జట్టులోని ఆటగాళ్లతో అన్నాను. మా టీమ్‌లో ఎలాంటి ప్రతిభ ఉందో మాకు బాగా తెలుసు. మేము అందరికంటే ముందే ఫైనల్‌కు చేరడానికి ఒక బలమైన కారణం ఉంది. మేము సహజసిద్ధమైన క్రికెట్‌ను నమ్ముకుని, మా ప్రణాళికను సరిగ్గా అమలు చేస్తే.. ఈ టోర్నమెంట్‌లోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందని భావించాము. గ్రూప్ స్టేజ్‌లో మేం అంత బాగా రాణించడానికి కారణం ఇదే' అని విరాట్ వెల్లడించాడు.'మా ప్లేయర్ల నైపుణ్యాలు, వారిలోని పరిణతి , ఒత్తిడిని తట్టుకునే మానసిక స్థిరత్వం ఫైనల్ మ్యాచ్‌లో మరోసారి మైదానంలో స్పష్టంగా కనిపించాయి. గతంలో ఓ మ్యాచ్ ఓడిపోయాక ముంబై ఇండియన్స్‌పై చాలా క్లోజ్ మ్యాచ్‌లో గెలిచాం. ఆ ఉత్కంఠ పోరులో గెలిచిన తర్వాత మా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఆ తర్వాత కేకేఆర్‌పై భారీ విజయాన్ని నమోదు చేశాం. టేబుల్ టాపర్స్‌గా నిలిచి ఇప్పుడు మళ్లీ టైటిల్ అందుకున్నాం. మ్యాచ్‌లను ఒంటిచేత్తో గెలిపించగల ఆటగాళ్లు మా జట్టులో ఉన్నారు. మా జట్టులో ఎంతో మంది విభిన్న ఆటగాళ్లకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు రావడమే దీనికి నిదర్శనం' అని కోహ్లీ తెలిపాడు.

# సినిమా

## కొత్త మలుపు' చిత్రం ట్రైలర్ విడుదల

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొత్త మలుపు' జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. భైరవి ఆర్థ్యా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వం వహించగా, తాటి బాలకృష్ణ నిర్మిస్తున్నారు. తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ మూవీని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనుంది.

హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర ట్రైలర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ నటుడు భానుచందర్, ప్రముఖ గాయని సునీత, నిర్మాత సీ కళ్యాణ్, నటుడు రఘుబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



గ్రామీణ నేపథ్యంలోని రొమాంటిక్ ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రేమ, సస్పెన్స్, వినోదం సమపాళ్లలో ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ఆకాష్, భైరవి బావ?మరదళ్ల పాత్రల్లో కనిపించనున్నారు. రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. యశ్వంత్ సంగీతం అందించారు.

దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాట్లాడుతూ, "రొమాంటిక్ లవ్ సస్పెన్స్ జానర్‌లో ఈ సినిమాను రూపొందించాం. ఆకాష్?భైరవి జోడీ చాలా బాగా కుదిరింది. కోనసీమ అందాలను తెరపై ఆవిష్కరిస్తూ, మంచి కామెడీతో కూడిన కథను ప్రేక్షకులకు అందిస్తున్నాం. జూన్ 12న సినిమా విడుదల కానుంది" అన్నారు.

గాయని సునీత మాట్లాడుతూ, "ఆకాష్ ఎంతో కష్టపడే వ్యక్తి. మంచి స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. ఇది అతనికి రెండో సినిమా. దర్శకుడు శివ ప్రేక్షకులకు వినోదాన్ని పంచే కథను తీసుకొచ్చారు. మైత్రి సంస్థ ఈ చిత్రానికి అండగా నిలవడం గర్వకారణం" అన్నారు.

సీనియర్ నటుడు భానుచందర్ మాట్లాడుతూ, "ట్రైలర్ చాలా బాగుంది. హీరో, హీరోయిన్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. ఈ చిన్న సినిమాను ప్రేక్షకులు పెద్ద విజయంగా నిలబెట్టాలి" అన్నారు.

నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ, "ఇది నాకు తొలి సినిమా. మా దర్శకుడికి తొలి చిత్రం. హీరోయిన్ కు తొలి సినిమా. హీరో ఆకాష్‌కు రెండో సినిమా. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి" అని తెలిపారు.

హీరో ఆకాష్ మాట్లాడుతూ, "ఈ చిత్రానికి మంచి కథ అందించిన దర్శకుడికి కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ వంటి సంస్థ మద్దతు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. మా అమ్మ సునీతతో పాటు చిత్ర యూనిట్ అందరికీ ధన్యవాదాలు" అన్నారు.

హీరోయిన్ భైరవి ఆర్థ్యా మాట్లాడుతూ, "నా కెరీర్‌లో 'కొత్త మలుపు' చాలా ప్రత్యేకమైన చిత్రం. ప్రేమ, సస్పెన్స్, హాస్యం కలగలిపిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ఆకాష్‌తో నా జోడీ, బావ?మరదళ్ల పాత్రలు ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి" అని చెప్పారు.

నిర్మాత సీ కళ్యాణ్ మాట్లాడుతూ, "సునీత మా కుటుంబ సభ్యురాలిలాంటివారు. ఆమె కుమారుడు హీరోగా నటించిన ఈ చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. మైత్రి మూవీస్ విడుదల చేయడం ఈ సినిమాకు మరో బలం" అన్నారు.

నటుడు రఘుబాబు మాట్లాడుతూ, "మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నారంటే సినిమా స్థాయి అర్థమవుతుంది. ఆకాష్‌కు మంచి భవిష్యత్ ఉంది. చిత్ర యూనిట్ అందరికీ శుభాకాంక్షలు" అన్నారు.

'కొత్త మలుపు' కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా భావోద్వేగాలు, ఉత్కంఠ, హాస్యం, కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలతో కూడిన పూర్తి వినోదాత్మక చిత్రంగా రూపొందిందని చిత్రయూనిట్ సభ్యులు తెలిపారు.

నటీనటులు:

తారాగణం ఆకాష్ గోపరాజు: హీరో (ప్రసిద్ధ నేపథ్య గాయని సునీత కుమారుడు)

## జూన్ 3న 'ఇరుముడి' మూవీ గ్లింప్స్

మాస్ మహారాజా రవి తేజ యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' కోసం దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ హైదరాబాద్‌లో శరవేగంగా సాగుతోంది. 'ఇరుముడి' కమర్షియల్ మాస్ ఎంటర్‌టైమెంట్‌తో పాటు కుటుంబ భావోద్వేగాలు, ఆధ్యాత్మికత, డ్రామా అంశాలను సమపాళ్లలో మేళవిస్తూ శివ నిర్వాణ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు హృదయాన్ని హత్తుకునే కథనాన్ని అందిస్తూ, రవితేజను కొత్త కోణంలో చూపించబోతున్నారు.

ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను జూన్ 3న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ మనసుని తాకేలా ఉంది. ఓ కొండపై కూర్చుని దూరాన్ని వీక్షిస్తున్న హీరో, అతని చిన్నారి కుమార్తె పోస్టర్‌లో కనిపిస్తూ, వారి మధ్య ఉన్న అనుబంధాన్ని ఎంతో అందంగా చూపించారు. ఈ పోస్టర్ వారి ప్రయాణం వెనుక ఉన్న భావోద్వేగ కథపై ఆసక్తిని పెంచుతోంది.

ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర కీలక పాత్రలో కనిపించనుంది. సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక తదితర ప్రతిభావంతులైన నటీనటులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి జివి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.



శివ నిర్వాణ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించగా, నరేష్ బాబు పి స్క్రిప్ట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, ఆధ్యాత్మికత కలగలిసిన 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలవనుంది.

నటీనటులు: మాస్ మహారాజా రవితేజ, ప్రియా భవానీ శంకర్, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, మీసాల లక్ష్మణ్, రాజ్ కుమార్ కసిరెడ్డి, రమణ భార్గవ్, కిషోర్ కంచెరపాలెం, కార్తీక్ అదుసుమల్లి, మహేష్

## గన్ షాట్స్ కంటే డైలాగ్స్ హైలైట్ అవుతాయా?

టాలీవుడ్‌లో గ్లింప్స్ వీడియోలకి ఒక బెంచ్‌మార్క్ సెట్ చేసిన సినిమా పవన్ కళ్యాణ్ 'ఓజీ'. ఆ రేంజ్ ఇంపాక్ట్‌ని మళ్లీ చూపించే గ్లింప్స్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తుండగా.. ఇప్పుడు నటసింహం నందమూరి బాలకృష్ణ 'ఔఐ 111' ఆ రికార్డులను బద్దలు కొట్టడానికి రెడీ అవుతోంది. ఈ జూన్ 10న బాలయ్య పుట్టినరోజు కానుకగా రాబోతున్న ఫస్ట్ గ్లింప్స్ ట్రీట్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఒక వీరాభిమాని అయిన దర్శకుడు సినిమా తీస్తే ఎలా ఉంటుందో చూపించడానికి గోపీచంద్ మలినేని సిద్ధమవ్వడమే దీనికి కారణం. లొకేషన్ ఒకటే.. ఇంపాక్ట్ మారేనా?: పవన్ కళ్యాణ్ 'ఓజీ' గ్లింప్స్‌లో ముంబై పోర్ట్ బ్యాక్‌డ్రాప్‌ను దర్శకుడు సుజీత్ చాలా స్టైలిష్‌గా, డార్క్ షేడ్‌లో చూపించి మైండ్ బ్లాక్ చేశారు. ఇప్పుడు ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే.. బాలయ్య 111 టీమ్ కూడా అదే ముంబై లొకేషన్లలో బిజీగా ఉంది. ఇక ఈ సినిమా కూడా గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లోనే వస్తుండటంతో.. 'ఓజీ' తరహాలోనే సాలిడ్ అండ్ పవర్‌ఫుల్ విజువల్స్‌తో గోపీచంద్ మలినేని థియేటర్లలో పూనకాలు తెప్పిస్తారా అని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. ఫ్యాన్



బాయ్ డైరెక్షన్.. పూనకాలు లోడింగ్: ఈ సినిమాకు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. బాలయ్యతో ఇప్పటికే 'వీరసింహారెడ్డి' లాంటి బ్లాక్‌బస్టర్ కొట్టిన గోపీచంద్.. పక్కా ఫ్యాన్ బాయ్ డైరెక్టర్. ఒక అభిమానిగా తన హీరోని స్క్రీన్ మీద ఎలా చూడాలనుకుంటాడో.. ప్రేక్షకులకు కూడా అదే రేంజ్ విజువల్ ట్రీట్ ఇస్తాడు. బాలయ్య మాస్ ఇమేజ్‌ని, ముంబై మాఫియా బ్యాక్‌డ్రాప్‌ను ఆయన ఎలా ఎలివేట్ చేయబోతున్నాడనే క్యూరియాసిటీ అందరిలోనూ విపరీతంగా పెరిగిపోయింది. గన్ షాట్స్ వర్సెస్ పవర్‌ఫుల్ డైలాగ్స్: 'ఓజీ' గ్లింప్స్‌లో గన్ షాట్స్, బ్లడ్ షేడ్ బాగా హైలైట్ అయ్యాయి. కానీ, బాలయ్య గ్లింప్స్‌లో అంతకు మించిన సర్‌ప్రైజ్ ఉండబోతోందని టాక్. ఇక్కడ గన్ షాట్స్ కంటే బాలయ్య చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీనే మెయిన్ హైలైట్ కానుందట. ఇక బాలయ్య నోట ముంబై గ్యాంగ్‌స్టర్ రేంజ్ డైలాగులు పడితే, థియేటర్లలో ఫ్యాన్స్ సీట్లలో కూర్చోవడం కష్టమే! థమన్ బీజీఎం మ్యాజిక్: ఈ సినిమాకు కూడా మ్యూజిక్ డైరెక్టర్ థమనే వర్క్ చేస్తుండడం విశేషం. ఇప్పటికే బాలయ్యకు 'అఖండ', 'వీరసింహారెడ్డి' సినిమాలతో పూనకాలు తెప్పించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చిన థమన్.. ఈ ఫస్ట్ గ్లింప్స్ కోసం మరింత సాలిడ్ వర్క్ చేస్తున్నాడట. థమన్ ఇచ్చే థంపింగ్ మ్యూజిక్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లడం ఖాయం అని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. ఒక పెద్ద హీరోని, మరో ఫ్యాన్ బాయ్ డైరెక్టర్ హ్యాండిల్ చేస్తే వచ్చే కిక్కే వేరు. ఆ నమ్మకంతోనే బాలయ్య ఫ్యాన్స్ 'హిట్ కన్ఫామ్' అనే ధీమాతో ఉన్నారు. ఇక జూన్ 10న రాబోయే ఈ సాలిడ్ ట్రీట్ టాలీవుడ్‌లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో, బాక్సాఫీస్ రికార్డులను ఎలా తిరగరాస్తుందో చూడాలి!

## దృశ్యం 3 లో నర్స్.. ఆమె బ్యాక్ గ్రౌండ్ తెలిస్తే షాక్!



చదువుకు కాదేది అనర్హం అని నిరూపిస్తున్నారు కొంతమంది సెలబ్రిటీలు.. ముఖ్యంగా సాయి పల్లవిని మొదలుకొని శ్రీలీల వరకు ఇలా కొంతమంది హీరోయిన్లు ఒకవైపు సెట్లో సందడి చేస్తూనే.. మరొకవైపు అదే సెట్ లో విరామం దొరికితే పుస్తకాలతో కుస్తీలు పడి నేడు పట్టభద్రులు అవుతున్నారు. ముఖ్యంగా కొంతమంది డిగ్రీలు, బీటెక్లు చేసి సినిమా రంగంలోకి అడుగుపెడితే.. మరికొంతమంది ఎంబీబీఎస్ ఒకవైపు చదువుకుంటూనే మరొకవైపు సినిమాలలో నటీనటులుగా కొనసాగుతున్నారు. ఇక ఇలా సినిమాలలో నటిస్తూ మరొకవైపు తమ వైద్య విద్యను పూర్తి చేస్తున్నారు చీ ంటబ ఎఎ అలాంటి వారిలో శ్రీ లీలా కూడా ఒకరు. తన అద్భుతమైన నటనతో, మాస్ స్టెప్పులతో తెరపై సందడి చేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇటీవల ఎంబిబిఎస్ లో డిగ్రీ పట్టాను కూడా అందుకొని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో బ్యూటీ కూడా చేరిపోయింది. ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్ గా తన కెరీర్ మొదలుపెట్టి.. తెరపై తన ముద్దుముద్దు మాటలతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఆ తర్వాత పలు యాడ్స్ లో కూడా నటించింది. ఒకవైపు సీరియల్స్ , మరొకవైపు వాణిజ్య ప్రకటనలలో కనిపించి తన ప్యాషన్ నిరూపించుకున్న ఈమె.. చదువు, సినిమా రెండూ కావాలి అంటూనే వైద్య విద్యను పూర్తి చేసింది. ఇప్పుడు నటిగా అవతరించి తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని అలరిస్తోంది. అసలు విషయంలోకి వెళ్తే మలయాళ సూపర్ హిట్ మూవీ దృశ్యం ఫ్రాంచైజీలో భాగంగా దృశ్యం3 తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.జీతూ జోసెఫ్ దర్శకత్వంలో సూపర్ హిట్ థ్రిల్లర్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మిక్స్డ్ టాక్ సొంతం చేసుకుంది. మోహన్ లాల్, ఎస్తేర్ అనిల్, మీనా, కళాభవన్ సజోన్ , సిద్దిక్, మురళి గోపి తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. కేవలం 58 గంటల్లో 100 కోట్లు రాబట్టిన ఈ సినిమా ఏడు రోజుల్లో 200 కోట్లు రాబట్టి ఫ్రాంచైజీలో అత్యధిక వసూలు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇకపోతే ఈ సినిమాలో నర్సు పాత్రలో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది శ్రద్ధా గోకుల్.ఇక ఈ సినిమాలో నర్స్ గా కనిపించి తన అద్భుతమైన స్క్రీన్ ప్రెజెంట్స్ తో శ్రేయ పాత్రలో అందరినీ ఆకట్టుకున్న ఈమె.. నిజ జీవితంలో డాక్టర్ అని తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.. ఈ నేపథ్యంలోనే ఆమె బ్యాక్ గ్రౌండ్ గురించి ఆరా తీస్తున్నారు. మరి అసలు విషయంలోకి వెళ్తే.. మలయాళం లో వచ్చిన హలో కుట్టి చేతన్ సీరియల్ ద్వారా చిన్నతనంలోనే చైల్డ్ ఆర్టిస్ట్ గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శ్రద్ధా సూపర్ డాన్సర్ జూనియర్ అనే డాన్సర్ రియాల్టీ షోలో పాల్గొని తన టాలెంట్ తో జడ్జెస్ ను మెప్పించింది.

## 'సింగ్ గీతం'మూవీలో స్ట్రాంగ్ విలన్ క్యారెక్టర్ చేశా : హీరోయిన్ శాలిని కొండెపుడి

లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ముందుకు వస్తున్నారు. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'సింగ్ గీతం' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శాలిని కొండెపుడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.



సింగ్ గీతం జర్నీ ఎలా మొదలైయింది?

–ఇంతకుముందు నేను జయమ్మ పంచాయితీ, శుభం, మై డియర్ దొంగ చిత్రాలు చేశాను. తెలిసిన వారి ద్వారా ఈ సినిమాలో ఒక నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర ఉందని తెలిసింది. సింగీతం గారి సినిమా అంటే ఎలాంటి పాత్ర అయినా చేయాలని నిర్ణయించుకున్నాను. ఆడిషన్‌కి వెళ్లాను. ఆడిషన్ ఇచ్చిన నెల రోజుల తర్వాత ఓకే అయ్యింది.

–ఇలాంటి జానర్‌లో ఇప్పటివరకు సినిమా రాలేదు. ఈ సినిమాలో ప్రతిది మ్యూజికల్ గా వుంటుంది. ప్రతి ఆర్టిస్ట్‌కి కొంచెం శృతిలో పాడటం రావాలి. ఇందుకోసం చాలా వర్క్‌షాప్స్ చేశాం.

ఈ కథ ఎలా ఉండబోతుంది? సంగీతం గారి దర్శకత్వంలో వర్క్ చేయడం ఎలా అనిపించింది ?

–ఈ కథ ఆలోచన సింగీతం గారికి చాలా ఏళ్ల క్రితమే వచ్చింది. అయితే ఈ రోజుకీ ఎంతో రిలెవెంట్‌గా అనిపించే కథ ఇది. ఇందులో ప్రతి మాట మ్యూజికల్‌గా ఉంటుంది. సంభాషణలు కూడా పాటల్లా సాగుతాయి.

–ఇటీవల విడుదలైన పాట ద్వారా ప్రేక్షకులకు సినిమా టోన్‌పై కొంత క్లారిటీ వచ్చి ఉంటుంది. అయితే అందరూ మాటలను పాటల్లా ఎందుకు పాడుతున్నారు? దాని వెనుక కారణం ఏమిటి? అనేది సినిమా చూసినప్పుడు తెలుస్తుంది. సింగీతం గారు ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఆయన విజన్ ప్రకారమే సినిమా రూపొందింది. ఆయన దర్శకత్వంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

ఇది ఫిక్షనల్ కథనా?

–ఈ కథ 'కుబేరపురం' అనే ఒక ఫిక్షనల్ గ్రామంలో జరుగుతుంది. ఆ ఊరిలో ఏమి జరుగుతుంది? ఎందుకు అందరూ పాటల రూపంలో మాట్లాడతారు? అనేది థియేటర్‌లో చూసి ఆస్వాదించాల్సిందే.

–ఇది పూర్తిగా ఒరిజినల్ కాన్సెప్ట్. దీనికి ఎలాంటి సినిమా రిఫరెన్స్ లేదు. మాకు ఉన్న ఏకైక రిఫరెన్స్ సింగీతం గారు , నాగ్ అశ్విన్ గారి విజనే. నాగ్ అశ్విన్ గారి విజన్, సెన్సిబిలిటీ కూడా సినిమాలో కనిపిస్తుంది.

–ఇది భారతీయ సినీ చరిత్రలోనే తొలి మ్యూజికల్ కామెడీ ఫిల్మ్. సింగీతం గారి గత చిత్రాల తరహాలోనే వినూత్నమైన అనుభూతిని ఇస్తుంది.

మీ పాత్ర గురించి చెప్పండి?

–సింగీతం గారి సినిమాలో ప్రతి పాత్రకి కథలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. నేను చేసిన విలన్ పాత్ర కూడా అంతే బలంగా ఉంటుంది. తాను అనుకున్నది సాధించాలనుకునే మనస్తత్వం ఉన్న మనిషి. తాను నమ్మిందే నిజమని భావించే పాత్ర.

–ఈ పాత్రలో చాలా షేడ్స్ ఉన్నాయి. ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉంటుంది. కథలో చాలా కీలకమైన పాత్ర ఇది. హీరో, హీరోయిన్ పాత్రలతో పాటు నా పాత్ర కూడా చాలా ఎంటర్టైనింగ్ గా వుంటుంది. ఇలాంటి పాత్రలు తరచూ రావు.

–ఇలాంటి కథలో నటించే అవకాశం అందరికీ రాదు. ఈ సినిమా ద్వారా మాకు అలాంటి అరుదైన అదృష్టం దక్కింది.

ఇందులో ఛాలెంజ్ గా అనిపించిన అంశం ఏమిటి ?

–పాటలు పాడే నటులు చాలామంది ఉంటారు. కానీ ఇందులో మాటలనే పాటలాగా పాడాలి. అదే అసలు ఛాలెంజ్. సాధారణంగా గాయకులు పాట పాడేటప్పుడు ఒక విధంగా వాయిస్ , మాట్లాడేటప్పుడు మరో విధంగా వుంటుంది. కానీ ఇందులో మాట్లాడటమే పాటగా మారిపోతుంది. అది చాలా కష్టమైన ప్రక్రియ.

–దేవిశ్రీ ప్రసాద్ గారు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. మాటలను పాటలుగా అద్భుతంగా మార్చారు. ఆయన సంగీతం గొప్ప బలాన్ని ఇచ్చింది.

–ఈ సినిమా ద్వారా నేను కూడా చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇది పూర్తిగా సింగీతం గారి స్టైల్‌లో రూపొందిన చిత్రం. ఒక ప్రేక్షకురాలిగా చాలా ఎంజాయ్ చేశాను.

నిర్మాతల గురించి?

–వైజయంతి మూవీస్, స్వప్న సినిమా చాలా పాషన్ వున్న ప్రొడ్యూసర్స్. చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. సినిమా అంటే ఇష్టం వుంటే తప్పా ఇలాంటి కొత్త తరహా చిత్రాలు చేయలేం. ఎంతో నిజాయితీతో ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఇలాంటి కొత్త తరహా సినిమాలు విజయవంతమైతే మరెందరో కొత్త ఆలోచనలతో ముందుకు వస్తారు.

మీరు చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తుంటారు కదా?

–మంచి కథలు, మంచి పాత్రల కోసం చూస్తుంటాను. అలాంటి పాత్రలు వస్తే ప్రతి నెలా ఒక సినిమా చేయాలని ఉంటుంది (నవ్వుతూ).

మీ నెక్స్ట్ మూవీస్ ?

–ఇంతముందుకు మై డియర్ దొంగ సినిమా నేనే రాశాను. నా నెక్స్ట్ సినిమా నా దర్శకత్వంలో ఉంటుంది. కథ కూడా నేనే రాస్తున్నాను. అందుకే నేనే డైరెక్ట్ చేస్తే బాగుంటుందని అనిపించింది. కామెడీ జానర్‌లో రూపొందుతోంది. ప్రేక్షకులను నవ్వించే సినిమాలు చేయడం నాకు ఇష్టం.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com